మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శుక్రవారం FRIDAY 14-11-2025 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 135 Issue: 135

14 నవంబర్ 2025 - శుక్రవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - శరత్ ఋతువు కార్తీక మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:24 సూర్యాస్తమయం - సా. 5:36 తిథిః దశమి రా. 12:52ం వరకు తరువాత ఏకాదశి సంస్కృత వారం భృగు వాసరః నక్షత్రం పూర్వ ఫల్గుని(పుబ్బ) రా. 9:19 వరకు తరువాత ఉత్తర ఫల్గుని(ఉత్తర) యోగం వైధృతి ఉ. 6:15ం వరకు కరణం వనిజ మ. 12:10 వరకు విష్టి రా. 12:52ం వరకు వర్జ్యం తె. 5:12 నుండి ఉ. 6:57 వరకు దుర్ముహూర్తం ఉ. 8:38 నుండి ఉ. 9:23 వరకు మ. 12:22 నుండి మ. 1:07 వరకు రాహుకాలం ఉ. 10:36 నుండి మ. 12:00 వరకు యమగండం మ. 2:48 నుండి సా. 4:12 వరకు గుళికాకాలం ఉ. 7:48 నుండి ఉ. 9:12 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:48 నుండి తె. 5:36 వరకు అమృత ఘడియలు మ. 2:28 నుండి సా. 4:11 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:38 నుండి మ. 12:22 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున

Published from Jagitial

www.evarthalu.com




## ఉగ్ర డెన్.. అల్ ఫలాహ్ సభ్యత్వం సస్పెండ్

వైట్ కాలర్ ఉగ్రవాదులకు డెన్‌గా మారిన హర్యానాలోని ఫరీదాబాద్ లోని అల్ ఫలాహ్ యూనివర్సిటీకి షాక్ తగిలింది. ఆ యూనివర్సిటీ ఆర్థిక వ్యవహారాలను ఈడీ దర్యాప్తు చేయనుండగా, అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ (ఏఐయూ).. విశ్వవిద్యాలయ సభ్యత్వాన్ని సస్పెండ్ చేసింది. అన్ని యూనివర్సిటీలు మంచి స్థితిని కొనసాగించినంత వరకు మాత్రమే సభ్యులుగా ఉంటాయని పేర్కొంది.

న్యూఢిల్లీ: మీడియా నివేదికల ప్రకారం.. అల్ ఫలాహ్ యూనివర్సిటీ మంచి స్థితిలో ఉన్నట్లు కనిపించడం లేదని అధికారిక లేఖలో పేర్కొంది. దీంతో ఏఐయూ విశ్వవిద్యాలయం సభ్యత్వాన్ని తక్షణమే నిలిపివేస్తున్నట్లు తెలిపింది. దాని ఆపరేషన్లలో పేరు/లోగో ఉపయోగించడం నిలిపేయాలని ఆదేశించింది. వర్సిటీ అధికారిక వెబ్‌సైట్ నుండి ఏఐయూ లోగో వెంటనే తొలగించాలని స్పష్టం చేసింది. విద్యార్థుల భద్రత, విద్య ప్రమాణాల పరిరక్షణ కోణంలో సభ్యత్వాన్ని సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపింది. ఈ సభ్యత్వం రద్దుతో, యూనివర్సిటీకి ఏఐయూ గుర్తింపు ద్వారా లభించే ప్రయోజనాలు ఇకపై ఉండవు.



## పార్టీ జంప్.. ఎమ్మెల్యే డిస్‌క్వాలిఫై!

పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై కఠిన చర్యలు తీసుకునే విషయంలో దేశవ్యాప్తంగా ఎప్పటి నుంచో చర్చలు జరుగుతుండగా, కలకత్తా హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. పార్టీ మారిన ఎమ్మెల్యేను ఆ పదవికి అనర్హుడిగా ప్రకటించింది. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ టికెట్‌పై గెలిచి తృణమూల్ కాంగ్రెస్ పార్టీ (టీఎంసీ)లో చేరిన కేంద్ర మాజీ మంత్రి ముకుల్ రాయ్‌కి న్యాయస్థానంలో చుక్కెదురైంది.

కోల్‌కతా: బీజేపీ దాఖలు చేసిన అనర్హత పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు గురువారం సంచలన తీర్పు ఇచ్చింది. ముకుల్ రాయ్‌ను ఎమ్మెల్యేగా డిస్‌క్వాలిఫై చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 2021లో బిజెపి టికెట్‌పై గెలిచిన తర్వాత తృణమూల్ కాంగ్రెస్‌లో చేరడం ద్వారా రాయ్ తన సభ్యత్వాన్ని కోల్పోయారని జస్టిస్ దేబాంగ్సు బసక్ నేతృత్వంలోని డివిజన్ బెంచ్ స్పష్టం చేసింది. గతంలో రాయ్‌ను అనర్హులుగా ప్రకటించడానికి లేదా పబ్లిక్ అకౌంట్స్ కమిటీ నుంచి తొలగించడానికి నిరాకరించిన -2 వ పేజీలో...

## టెట్ నోటిఫికేషన్ రిలీజ్

### రేపటి నుంచి దరఖాస్తులు

### 29 వరకు అప్లైకి చాన్స్

### జనవరి 3 నుంచి పరీక్షలు



హైదరాబాద్, నవంబర్ 13 (ఈవార్తలు): ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు సర్కారు తీపి కబురు చెప్పింది. తెలంగాణ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) 2026 నోటిఫికేషన్‌ను పాఠశాల విద్యా శాఖ విడుదల చేసింది. ఏటా రెండుసార్లు టెట్ నిర్వహించాలనే నిబంధనను పటిష్టంగా అమలు చేస్తూ ఈ నోటిఫికేషన్‌ను ప్రకటించింది. పూర్తి నోటిఫికేషన్ శుక్రవారం విడుదల కానుంది. ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ నవంబర్ 15వ తేదీ శనివారం నుంచి ప్రారంభమై నవంబర్ 29వ తేదీ వరకు కొనసాగుతుంది. టెట్ పరీక్షలు




## 42 టేబుల్స్.. 10 రౌండ్లు

### జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కౌంటింగ్ నేడే

**ఉదయం 8 గంటలకు లెక్కింపు షురూ.. మధ్యాహ్నం 1 గంటకు ఫలితం వచ్చే చాన్స్**

జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల కౌంటింగ్ కోసం సర్వం సిద్ధమైంది. రాష్ట్ర ఎన్నికల సంఘం పర్యవేక్షణలో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభమై, మధ్యాహ్నం 1 గంట వరకు ఫలితం వెలువడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. మొత్తం 407 పోలింగ్ స్టేషన్లకు గాను 42 టేబుల్లు ఏర్పాటు చేయగా 10 రౌండ్ల కౌంటింగ్ జరగనుంది. ఒక్కో టేబుల్ వద్ద ముగ్గురు అధికారులు లెక్కింపులో పాల్గొంటారు. ప్రతి రౌండ్ పూర్తయ్యాక ఫలితాలను వెంటనే ఈసీ అధికారిక వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తారు.

జూబ్లీహిల్స్/హైదరాబాద్, నవంబర్ 13 (ఈవార్తలు): కౌంటింగ్ సెంటర్ల వద్ద పోలీస్, సీఐఎస్ఎఫ్, స్పెషల్ బ్రాంచ్ బలగాలను ఈసీ మోహరించింది. అనుమానితులపై ప్రత్యేక నిఘా పెట్టింది. ఈ ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ ఓట్లు రాకపోవడంతో ముందుగా హోం ఓటింగ్ ఓట్ల లెక్కింపు ప్రారంభించనున్నారు. హోం ఓటింగ్ కోసం 103 మంది దరఖాస్తు చేయగా, 101 మంది ఓటు వేశారు. ఇద్దరు ఓటర్లు మరణించారని అధికారులు తెలిపారు. హోం ఓటింగ్ తర్వాత షేక్‌పేట్ డివిజన్ ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. చివరగా ఎర్రగడ్డ డివిజన్ ఓట్ల కౌంటింగ్ ఉంటుంది. ఇదిలా ఉండగా, జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మొత్తం 4,01,365 మంది ఓటర్లు ఉన్నారు, అందులో పురుషులు 2,08,561, మహిళలు 1,92,779, ఇతరులు 25 మంది. వీరిలో 1,94,631 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. వారిలో పురుషులు 99,771, మహిళలు 94,855, ఇతరులు 5 మంది ఉన్నారు. మొత్తంగా 48.49 శాతం పోలింగ్ నమోదైంది. దాదాపు అన్ని సర్వే సంస్థలూ ఎగ్జిట్ పోల్‌లో కాంగ్రెస్‌వైపే మొగ్గుచూపగా, తాము గెలిచి తీరుతామని, సైలెంట్ ఓటింగ్ కలిసి వస్తుందని బీఆర్ఎస్ ధీమాతో ఉంది.

## చిన్నారులకూ.. చక్కెర గోలీలు!

### పిల్లల్లో పెరుగుతున్న టైప్–1 డయాబెటిస్

**తగ్గుతున్న బరువు, అధిక మూత్ర విసర్జన... నిద్రలేమి, నీరసం, చికాకుతో సతమతం**

**ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న కేసులు.. తెలుగు రాష్ట్రాల్లోనూ ప్రమాదకరంగా వ్యాధి**

కరీంనగర్ పట్టణానికి చెందిన అరుణ, ప్రవీణ్ (పేర్లు మార్చాం) దంపతులు ప్రభుత్వ టీచర్లుగా పనిచేస్తున్నారు. వీరికి ఒక్కగానొక్క కొడుకు. వయసు ఆరేళ్లు. ప్రతి రోజు పక్క తడుపుతుండటంతో చిన్న వయసులో కామనే అనుకున్నారు. ఆ మధ్య జ్వరం రావడంతో దవాఖానలో చూపించారు. జ్వరం తగ్గినా, తీవ్ర అలసటతో బాధపడ్డాడు. నిద్ర సరిగా పోవడం లేదు. డౌట్ వచ్చి మళ్లీ డాక్టర్‌ను సంప్రదిస్తే.. మధుమేహం టైప్1 అని తెలిసింది. అతడికి జీవితాంతం ఇన్సులిన్ ఇంజెక్షన్లు ఇవ్వాల్సిందే.



(ఈవార్తలు హెల్త్ డెస్క్)

పిల్లల ఆరోగ్యంలో టైప్–1 డయాబెటిస్ అత్యంత ప్రమాదకరంగా మారుతోంది. చిన్న వయసులోనే ఈ వ్యాధి రావడం తల్లిదండ్రులను ఆందోళనకు గురిచేస్తోంది. ఈ వ్యాధి తన ఇన్సులిన్ ఉత్పత్తి చేసే కణాలనే నాశనం చేస్తుంది. ఫలితంగా రక్తంలో చక్కెర స్థాయి అదుపు తప్పుతుంది. వైద్య నిపుణులు దీనిని ఆటోఇమ్యూన్ డిసీజ్‌గా వర్గీకరిస్తున్నారు. టైప్–1 డయాబెటిస్‌ను గతంలో జువెనైల్ డయాబెటిస్ అని పిలిచేవారు. ఇన్సులిన్ హార్మోన్ ఉత్పత్తి చేసే కణాలను శరీర రోగనిరోధక వ్యవస్థ దాడి చేయడం వల్ల నాశనమవుతాయి. ఫలితంగా ఇన్సులిన్ ఉత్పత్తి పూర్తిగా ఆగిపోతుంది. ఇన్సులిన్ -2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు



| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.12,862 |
| వెండి (గ్రాము): | రూ.183 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,612 |



## ఇక గూగుల్ రోడ్డు.. టీసీఎస్ వీధి!

### హైదరాబాద్‌లో ట్రెండ్ మారుస్తాం.. రోడ్లకు కంపెనీల పేర్లు పెడతాం

**భాగ్యనగరం పెట్టుబడులకు గమ్యస్థానం.. వసతులు, భద్రతకు మాది హామీ.. యూఎస్ఐఐఎస్‌పీఎఫ్‌లో సీఎం రేవంత్**

హైదరాబాద్‌లో రోడ్లకు నాయకుల పేర్లకు బదులు, కంపెనీల పేర్లు పెడతామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మూస ధోరణికి స్వస్తి పలికి, కొత్త ట్రెండ్‌ను ప్రవేశపెడతామని చెప్పారు. ముఖ్యమైన రోడ్లకు గూగుల్, మెటా, టీసీఎస్, ఇన్ఫోసిస్ వంటి కంపెనీల పేర్లు పెడతామని తెలిపారు. గురువారం ఢిల్లీలో జరిగిన అమెరికా – భారతదేశం వ్యూహాత్మక భాగస్వామ్య సదస్సులో (యూఎస్ఐఐఎస్‌పీఎఫ్) సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగించారు. హైదరాబాద్ నగరం ప్రపంచవ్యాప్త పెట్టుబడిదారులకు అత్యుత్తమ గమ్యస్థానమని తెలిపారు.

న్యూఢిల్లీ/హైదరాబాద్, నవంబర్ 13 (ఈవార్తలు): అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులు, పరిశ్రమలకు అనువైన వాతావరణం, భద్రతకు ఎటువంటి ఢోకా లేకుండా భౌగోళికంగా కేంద్ర స్థానంలో హైదరాబాద్ నగరం ఉందని చెప్పారు. అందువల్లే ప్రపంచవ్యాప్త పెట్టుబడిదారులకు అత్యుత్తమ గమ్యస్థానమని వివరించారు. దేశంలోనే -2 వ పేజీలో...



## 8 మంది సజీవ దహనం

### పుణెలో ఘోర రోడ్డు ప్రమాదం

### 6 వాహనాలను ఢీకొట్టిన ట్రక్కు

### 20 మందికి తీవ్ర గాయాలు

## వృద్ధి రేటు 6.5 శాతం

### సానుకూలంగా దేశ జీడీపీ


### మూడీస్ రేటింగ్స్ అంచనా

భారత జీడీపీ 2027 నాటికి దాదాపు 6.5 శాతం మేర వృద్ధిని సాధిస్తుందని ప్రముఖ ఏజెన్సీ మూడీస్ రేటింగ్స్ అంచనా వేసింది. 2026లో 6.4 శాతం, ఆ తర్వాతి ఏడాది 6.5 శాతం పెరుగుతుందని తెలిపింది. 'దేశ మౌలిక సదుపాయాల్లో భారీ పెట్టుబడులు, ప్రజల ఖర్చు చేసే ధోరణి పెరగడం, ఎక్కువ దేశాలకు ఎగుమతుల ద్వారా దేశ వృద్ధి సమర్థంగా కొనసాగనుంది. అయితే, ప్రైవేట్ కంపెనీలు ఖర్చుల విషయంలో అప్రమత్తంగా ఉండటం కొంత ప్రతికూలంగా ఉండవచ్చు.




న్యూఢిల్లీ: భౌగోళిక రాజకీయ సవాళ్లు, భారతీయ వస్తువులపై అమెరికా అధిక సుంకాలు ఉన్నప్పటికీ దేశ ఆర్థికవ్యవస్థ పటిష్టంగా ఉంది' అని వెల్లడించింది. ఈ సందర్భంగా వివిధ దేశాల సెంట్రల్ బ్యాంకులు వేర్వేరు ద్రవ్య విధనాలను -2 వ పేజీలో...

## విశ్వవాణి



సిమ్ అవసరం లేకుండానే, మొబైల్ నెట్‌వర్క్‌తో సంబంధం లేకుండానే కేవలం రేడియో ఫ్రీక్వెన్సీ టెక్నాలజీతోనే ఫోన్ మాట్లాడుకొనే మొబైల్‌ఫోన్‌ను నమీబియాకు చెందిన సైమన్ పీట్రస్ అభివృద్ధి చేశాడు. పలు ఎలక్ట్రానిక్ పరికరాలు, ఒక టీవీ, టు వే రేడియోతోనే తాను ఈ ఫోన్‌ను తయారుచేశాడు.

## డిసెంబర్‌లో ఆర్టీసీ జాబ్స్ నోటిఫికేషన్

### నిరుద్యోగులకు మంత్రి పొన్నం గుడ్ న్యూస్

హైదరాబాద్, నవంబర్ 13 (ఈవార్తలు): నిరుద్యోగులకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శుభవార్త చెప్పారు. డిసెంబర్‌లో మరో జాబ్ నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే ఆర్టీసీలో 1000 డ్రైవర్లు,743 శ్రామిక్ పోస్టులకు నోటిషికేషన్ జారీ చేశామని, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ ఆధ్వర్యంలో వీటిని భర్తీ చేస్తున్నారన్నారు. ప్రస్తుతం ఈ పోస్టులకు సంబంధించి ఇంటర్వ్యూ దశలో ఉన్నాయని, ఈ నియామకాలు వేగంగా, పారదర్శకంగా జరిగేలా చూస్తామన్నారు. గురువారం సచివాలయంలో ఆర్టీసీ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డిసెంబర్ చివరి నాటికి మరో నోటిఫికేషన్ విడుదల చేస్తామని తెలిపారు. దీని ద్వారా 114 సూపర్‌వైజర్ ట్రైనీ, 84 ట్రాఫిక్ సూపర్‌వైజర్ ట్రైనీ పోస్టులను భర్తీ చేస్తామన్నారు. టీజీపీఎస్సీ లేదా పోలీస్ బోర్డు ద్వారా ఈ పోస్టులను భర్తీ చేస్తామని ప్రకటించారు. అలానే కారుణ్య నియామకాల కింద చేరిన కండక్టర్లకు ఉన్న 3 ఏళ్ల ప్రొవిజన్‌ను 2 ఏండ్లకు తరువాయి 2 వ పేజీలో...



## రాశి ఫలాలు

14.11.2025

**మేషం:** ఉద్యోగమున అధికారులతో నూతన సమస్యలు తప్పవు. ఆదాయం అంతంత మాత్రంగా ఉంటుంది. వృత్తి వ్యాపారాలు ఆశించిన రీతిలో రాణించవు. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. ఋణ సమస్యల వలన మానసిక ఒత్తిడి పెరుగుతుంది. కుటుంబ సభ్యులతో మాటపట్టింపులు ఉంటాయి.

**వృషభం:** వృత్తి వ్యాపారాలు మరింత ఉత్సాహంగా సాగుతాయి. చేపట్టిన పనులలో అవరోధాలు అధిగమించి సకాలంలో పూర్తి చేస్తారు. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. సోదరుల నుండి శుభవార్తలు అందుతాయి. సోదరుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. విద్యార్థులు పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు.

**మిథునం:** నూతన వ్యాపారాల ప్రారంభానికి అవరోదాలుంటాయి. కొన్ని వ్యవహారాలు మందకొడిగా సాగుతాయి. ధన వ్యవహారాలు అంతగా కలసిరావు. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వృత్తి ఉద్యోగాలలో అదనపు బాధ్యతలు వలన తగిన విశ్రాంతి ఉండదు. ఇంటా బయట గందరగోళ పరిస్థితులుంటాయి.

**కర్కాటకం:** ఇంటాబయట కొన్ని ఆశ్చర్యకరమైన సంఘటనలు చోటుచేసుకుంటాయి. నూతన విషయాలపై దృష్టి సారిస్తారు. విద్యార్థులు కష్టానికి తగిన ఫలితం పొందుతారు. వ్యాపారాలలో ఆశించిన పురోగతి సాధిస్తారు. ఆదాయమార్గాలు పెరుగుతాయి. చిన్ననాటి మిత్రులు సహాయంతో పనులు సకాలంలో పూర్తిచేస్తారు.

**సింహం:** ఇతరుల వ్యవహారాలలో జోక్యం చేసుకోవడం మంచిది కాదు. చిన్ననాటి మిత్రులతో పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. వ్యాపారమున తొందరపాటు నిర్ణయాలు తీసుకుని నష్టపడతారు. వృత్తి ఉద్యోగాలలో అధికారుల నుండి విమర్శలు తప్పవు. ఆదాయనికి మించి ఖర్చులు పెరుగుతాయి.

**కన్య:** వ్యాపార విస్తరణకు నూతన పెట్టుబడులు అందుతాయి. నూతన కార్యక్రమాలు ప్రారంభానికి శ్రీకారం చూడతారు. మిత్రులతో దూర ప్రయాణ సూచనలున్నవి. వృత్తి ఉద్యోగాలలో ఆశించిన పురోగతి లభిస్తుంది. ఆర్థిక పరిస్థితి అనుకూలించి పాత ఋణాలు తీరుస్తారు. కొన్ని వ్యవహారాలలో ఆప్తుల సలహాలు కలసి వస్తాయి.

**తుల:** వృత్తి వ్యాపారాలలో సమస్యలను అధిగమించి లాభాలు పొందుతారు. చేపట్టిన వ్యవహారాలు విజయం సాధిస్తారు. ఉద్యోగమున అందరితో సఖ్యతగా వ్యవహరించిన ప్రశంసలు అందుకుంటారు. నిరుద్యోగులకు నూతన ఉద్యోగావకాశాలు లభిస్తాయి. విద్యార్థులు నూతనోత్సాహంతో ముందుకు సాగుతారు.

**వృశ్చికం:** వృత్తి వ్యాపారాలలో ఊహించని స్థానచలన సూచనలు ఉన్నవి. ఇంటాబయట ఒత్తిడులు అధికమవుతాయి. ఆర్థిక వ్యవహారాలు నిరుత్సాహపరుస్తాయి. పితృవర్గం వారితో మాట పట్టింపులుంటాయి. అనారోగ్య సమస్యలను అశ్రద్ధ చేయడం మంచిది కాదు. కుటుంబ సభ్యుల ప్రవర్తన మానసికంగా బాధిస్తుంది.

**ధనస్సు:** దూర ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా సాగుతాయి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. నిరుద్యోగ ప్రయత్నాలు నిరుత్సాహపరుస్తాయి. వ్యాపారాలలో అధిక శ్రమతో అల్ప ఫలితం పొందుతారు. ఇతరుల వ్యవహారాలలో జోక్యం చేసుకోకపోవడం మంచిది కాదు.

**మకరం:** వివాదాలకు సంభందించి కీలక సమాచారం అందుతుంది. సంతాన వివాహ విషయమై ప్రస్తావన వస్తుంది. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగమున మీ మాటకు విలువ మరింత పెరుగుతుంది. గృహనిర్మాణ పనులు వేగవంతం చేస్తారు. ఇతరుల అవసరానికి సైతం ధన సహాయం చేస్తారు.

**కుంభం:** ఆర్థిక వ్యవహారాలు ఆశజానాకంగా ఉంటాయి. చేపట్టిన పనులలో కష్టానికి తగిన ఫలితం లభిస్తుంది. కొన్ని వ్యవహారాలలో సన్నిహితుల సహాయ సహకారాలు అందుతాయి. వ్యాపార ఉద్యోగాలు లాభసాటిగా సాగుతాయి. గృహ నిర్మాణ ఆలోచనలు ఆచరణలో పెడతారు. మిత్రుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి.

**మీనం:** నూతన పెట్టుబడుల విషయంలో పునరాలోచన చెయ్యడం మంచిది. ఉద్యోగమున చిన్న పాటి ఇబ్బందులు తప్పవు. ఆర్థిక వ్యవహారాలు మందగిస్తాయి. చేపట్టిన పనులలో శ్రమాధిక్యత తప్పదు. సంతాన విద్యా విషయాలు కొంత నిరుత్సాహపరుస్తాయి. ఇతరులతో తొందరపడి మాట్లాడటం మంచిది కాదు. ముఖ్యమైన వ్యవహారాలు వాయిదా పడుతాయి.



# 8 మంది సజీవ దహనం

## పుణెలో ఘోర రోడ్డు ప్రమాదం.. 6 వాహనాలను ఢీకొట్టిన ట్రక్కు . 20 మందికి తీవ్ర గాయాలు

పుణె: మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. గురువారం పుణెలోని నవ్లే బ్రిడ్జిపై ఒక భారీ అగ్ని ప్రమాదం జరిగింది. రెండు కంటైనర్ ట్రక్కులు ఢీకున్నాయి. వాటిలో ఒకటి మంటల్లో చిక్కుకుంది. రెండు ట్రక్కుల మధ్య ఒక కారు ఇరుక్కుపోయి పూర్తిగా కాలిపోయింది. ఈ ఘటనలో ఎనిమిది సజీవ దహనం అయ్యారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే సంఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పి సహాయక చర్యలు చేపట్టారు. కాలిపోతున్న వాహనాల్లో మరింత మంది చిక్కుకోవడంతో వారిని రక్షించి, ఆస్పత్రులకు తరలించారు. పుణె నగర శివార్లలోని ముంబై-బెంగళూరు హైవేపై ఈ సంఘటన జరిగింది. ప్రమాదానికి సంబంధించిన వీడియో ఫుటేజీలను పోలీసులు పరిశీలించారు. రెండు భారీ ట్రక్కులు ఢీకొనడం, ట్రక్కులు పేలి మంటలు చెలరేగడం, ఒక కారును ధ్వంసం చేయడం స్పష్టంగా కనిపించింది. ఈ ఘోర ప్రమాదంతో రద్దీగా ఉండే హైవేపై ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

# డిసెంబర్‌లో ఆర్టీసీ జాబ్స్ నోటిఫికేషన్

మొదటి పేజీ తరువాయి

తగ్గించేలా చర్యలు తీసుకోవాల్సిందిగా మంత్రి పొన్నం అధికారులకు సూచించారు. మేడారం జాతరకు సమయం దగ్గర పడుతుండటంతో... ములుగు బస్ స్టాండ్ నిర్మాణం వేగంగా పూర్తి చేయాలని మంత్రి పొన్నం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అదనపు ఆదాయం మీద దృష్టి సారించాలని మంత్రి పొన్నం ఆర్టీసీ ఉన్నతాధికారులకు సూచనలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం ద్వారా.. ఆర్టీసీకి ప్రతి నెల ఆదాయం వస్తుందని.. ఇది మాత్రమే సరిపోదని.. అదనపు ఆదాయం కోసం చర్యలు తీసుకోవాలని సూచించారు. మహాలక్ష్మి పథకం ద్వారా.. ఇప్పటి వరకు ఆర్టీసీలో మహిళలకు 237 కోట్ల జీరో టికెట్‌లు మంజూరు చేశారని.. వీటి ద్వారా ఆర్టీసీకి ప్రభుత్వం రూ.7,980 కోట్లు చెల్లించిందని తెలిపారు. హైదరాబాద్‌లో పెరుగుతున్న ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్యను కూడా పెంచుకునేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని సూచించారు. పీఎం ఈ-డ్రైవ్ కింద నగరానికి రాబోయే ఈ బస్సులకు సరిపోయేలా మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు. నగరంలో కొత్త కాలనీలు పెరుగుతున్న నేపథ్యంలో డిమాండ్‌కు తగ్గట్టుగా ఆ రూట్‌లలో బస్సులను నడిపించేందుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 578 బస్సులు కొత్తగా రోడ్డెక్కాయని.. త్వరలోనే రాష్ట్రానికి మరిన్ని కొత్త బస్సుల వస్తాయని.. వీటిని ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో నడిపించాలని సూచించారు.

# ఇక గూగుల్ రోడ్డు.. టీసీఎస్ వీధి!

మొదటి పేజీ తరువాయి

సంఖ్యలో యువత, వేగవంతమైన వృద్ధి రేటుతో ఉన్న రాష్ట్రం తెలంగాణ అని కుండబద్ధలు కొట్టారు. తెలంగాణలో గత 35 ఏళ్లుగా కాంగ్రెస్‌తో పాటు అనేక పార్టీలు ప్రభుత్వాలకు సారథ్యం వహించినా పెట్టుబడులకు, పెట్టుబడిదారులకు అందరూ మద్దతుగా నిలిచారని వివరించారు. భారతదేశంలో పెట్టుబడులకు హైదరాబాద్ ముఖ ద్వారమని తెలిపారు. జీసీసీలకు గ్యమస్థానంగా ఉన్న హైదరాబాద్‌లో పెట్టుబడులకు ముందుకు రావాలని కోరుతూ పారిశ్రామికవేత్తలకు ఆహ్వానం పలికారు. మహిళా సాధికారిత, నాణ్యమైన విద్య, యువతకు నైపుణ్య శిక్షణ, పట్టణాభివృద్ధితో పాటు మెరుగైన వసతులు, అత్యున్నత జీవన ప్రమాణాలతో కూడిన అంతర్జాతీయ స్థాయి నగరంగా హైదరాబాద్‌ను నిలపడమే తన ప్రథమ ప్రాధాన్యత అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. గత 23 నెలల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సదస్సులో వివరించారు.




అద్భుతమైన మౌలిక వసతులతో 30 వేల ఎకరాల్లో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో భారత్ ఫ్యూచర్ సిటీ దేశంలోనే నూతన నగరంగా మారుతుందని చెప్పారు. మూసీ నదీ పునరుజ్జీవనం పూర్తయితే లండన్, టోక్యో, దుబాయి, సియోల్ రివర్‌ఫ్రంట్‌ల మాదిరే హైదరాబాద్ నైట్ ఎకానమీ కొత్త దశలోకి ప్రవేశిస్తుందని వివరించారు. డ్రై పోర్ట్, మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్, రేడియల్ రోడ్లు, ఓఆర్ఆర్- ఆర్ఆర్ఆర్ మధ్య మాన్యుఫ్యాక్చరింగ్ జోన్ వంటి కీలక మౌలిక సదుపాయాల కల్పనా ప్రాజెక్టుల పురోగతిని వివరించిన సీఎం రేవంత్ రెడ్డి... చైనా ౦1 మోడల్‌కు గ్లోబల్ సమాధానం తెలంగాణ అవుతుందని చెప్పారు. హార్వర్డ్, స్టాన్‌ఫోర్డ్, ఆక్స్‌ఫర్డ్ వంటి ఐవీ లీగ్ విశ్వవిద్యాలయాలు హైదరాబాద్‌లో ఆఫ్‌షోర్ క్యాంపస్‌లు ఏర్పాటు చేస్తే తక్కువ ఖర్చు, సులభమైన వీసా విధానాలతో దక్షిణాది దేశాల (గ్లోబల్ సౌత్) విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని చెప్తూ, ప్రపంచ స్థాయి విద్యాసంస్థలను రాష్ట్రానికి ఆహ్వానించారు.



## టెట్ నోటిఫికేషన్ రిలీజ్

మొదటి పేజీ తరువాయి

2026 జనవరి 3వ తేదీ నుంచి ప్రారంభమై.. అదే నెల 31వ తేదీ వరకు కొనసాగుతాయి. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లోని పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయి. ఉపాధ్యాయ అర్హత పరీక్షల్లో రెండు పేపర్లు ఉంటాయి. పేపర్-1: ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు బోధించడానికి, పేపర్-2: ఆరో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు బోధించడానికి. వాస్తవానికి, టెట్ పరీక్షను ఏటా రెండుసార్లు తప్పనిసరిగా నిర్వహించాలనే నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ నిబంధన ఉంది. కానీ, గత ప్రభుత్వ హయాంలో పదేళ్లలో నాలుగు సార్లే టెట్ నిర్వహించారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏటా రెండు సార్లు టెట్ నిర్వహిస్తున్నారు. ఇప్పటికే రెండు సార్లు టెట్ నిర్వహించిన ప్రభుత్వం.. తాజాగా 2026కు సంబంధించిన నోటిఫికేషన్‌ను ప్రకటించింది.ం



## పార్టీ జంప్.. ఎమ్మెల్యే డిస్‌క్వాలిఫై!

మొదటి పేజీ తరువాయి

స్పీకర్ బిమన్ బెనర్జీ నిర్ణయాన్ని కూడా ధర్మాసనం రద్దు చేసింది. తెలంగాణలోనూ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు కొందరు కాంగ్రెస్‌లో చేరారు. దీనిపై బీఆర్ఎస్ పార్టీ హైకోర్టు, ఆ తర్వాత సుప్రీంకోర్టును ఆశ్రయించింది. పార్టీ మారిన ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని కోరింది. ఆ కేసు విచారణ ప్రస్తుతం కోర్టులో, స్పీకర్ వద్ద కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో కలకత్తా హైకోర్టు తాజా తీర్పు రాజకీయ వర్గాల్లో సంచలనం రేపింది.




## వృద్ధి రేటు 6.5 శాతం

మొదటి పేజీ తరువాయి

అనుసరిస్తున్నాయని మూడీస్ అభిప్రాయపడింది. లేబర్ సమస్యల కారణంగా అమెరికా ఫెడ్ తన పాలసీ విధానాలను సవరిస్తోం దని, దీంతో ఇతర సెంట్రల్ బ్యాంకులు మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నా యని తెలిపింది. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో చైనా, ఇండోనేషియా రేట్లను తగ్గిస్తుండగా, భారతీయ రిజర్వ్ బ్యాంక్(ఆర్బీఐ) మాత్రం తన పాలసీ విధానాన్ని స్థిరంగా కొనసాగిస్తోందని మూడీస్ పేర్కొంది.

# చిన్నారులకూ.. చక్కెర గోలీలు!

మొదటి పేజీ తరువాయి

లేకుండా గ్లూకోజ్ కణాల్లోకి ప్రవేశించలేక రక్తంలో పేరుకుపోతుంది. ఇది హైపర్‌గ్లైసీమియాకు దారితీస్తుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ డేటా ప్రకారం, ప్రతి సంవత్సరం 96,000 మంది 15 ఏళ్ల లోపు పిల్లల్లో ఈ వ్యాధి నిర్ధారణ అవుతోంది. సాధారణంగా 4-7 ఏళ్లు లేదా 10-14 ఏళ్ల మధ్య పిల్లలో ఈ వ్యాధి ఎక్కువగా కనిపిస్తుంది. భారతదేశంలో గత దశాబ్దంలో టైప్-1 కేసులు 3-5 శాతం ఏటేటా పెరిగాయని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్ (ఐసీఎంఆర్) అధ్యయనాలు తెలిపాయి. ఢిల్లీ, పంజాబ్ వంటి రాష్ట్రాల్లో ఎక్కువ కేసులు నమోదవుతున్నాయి. ఈ మధ్య ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోనూ ఈ కేసులు అధికం అవుతున్నాయి.

### ఈ లక్షణాలు కనిపిస్తే జాగ్రత్త

డబ్ల్యూహెచ్‌వో, ఐసీఎంఆర్ నివేదిక ప్రకారం.. దేశంలో ప్రతి సంవత్సరం వేల మంది పిల్లలకు మధుమేహం వస్తోంది. సరైన సమాచారం లేకపోవడం వల్ల ఆలస్యంగా బయటపడుతోంది. అయితే, కొన్ని లక్షణాలతో మధుమేహాన్ని గుర్తించవచ్చని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.

తరచూ మూత్ర విసర్జన: రక్తంలో చక్కెర చాలా ఎక్కువగా ఉన్నప్పుడు.. శరీరం మూత్రం ద్వారా అదనపు గ్లూకోజ్‌ను వదిలించుకోవడానికి ప్రయత్నిస్తుంది. దీంతో రాత్రిపూట తరచుగా మూత్రానికి వెళ్లాల్సిన అవసరం ఏర్పడుతుంది. పిల్లలు రాత్రి సమయాల్లో ఎక్కువగా మూత్ర విసర్జన చేస్తుంటే అప్రమత్తం కావాలి. డయాబెటిస్ ఉంటే నిద్రపోతున్నప్పుడు మంచం తడిపేస్తారు.

అధిక దాహం: అధిక మూత్ర విసర్జన వల్ల డీహైడ్రేషన్ ఏర్పడుతుంది. దీంతో పిల్లలకు అసాధారణంగా దాహం వేస్తుంది. రక్తంలో చక్కెర స్థాయిలు పెరగడం వల్ల అధిక దాహం ఏర్పడుతుంది. పిల్లలు అకస్మాత్తుగా అవసరమైన దానికంటే ఎక్కువ నీరు తాగడం ప్రారంభిస్తే మధుమేహానికి సంకేతం కావచ్చు.

కారణం లేకుండా బరువు తగ్గడం: ఇన్సులిన్ సమస్యల కారణంగా కణాలు గ్లూకోజ్‌ను గ్రహించలేవు. శరీరం శక్తి కోసం కొవ్వును కరిగిస్తుంది. కండరాలను విచ్ఛిన్నం చేస్తుంది. దీంతో పిల్లలు కారణం లేకుండానే బరువు తగ్గుతారు.టైప్-1 డయాబెటిస్‌లో ఈ లక్షణం ఎక్కువగా కనిపిస్తున్నప్పటికీ, టైప్-2 డయాబెటిస్‌లో కూడా బరువు తగ్గే అవకాశం ఉంటుంది.



అలసట/బద్ధకం: కణాలలోకి తగినంత గ్లూకోజ్ ప్రవేశించకుండా, పిల్లల శరీరం శక్తిని కోల్పోతుంది. నిరంతరం అలసట, ఉత్సాహం లేకపోవడం, ఎక్కువగా నిద్రపోవడం లాంటి లక్షణాలు కనిపిస్తే మధుమేహం కావచ్చు.

అధిక ఆకలి: రక్తంలో చక్కెర అధికంగా ఉన్నా, కణాలకు శక్తి ఉండదు. ఇది ఆహారం ఎక్కువ తీసుకునేలా మెదడుకు సంకేతాలను పంపుతుంది. పిల్లలు నిరంతరం ఆకలితో ఉండి, భోజనం చేసిన వెంటనే మళ్లీ ఆహారం అడిగితే తల్లిదండ్రులు డాక్టర్‌ను సంప్రదించడం మేలు.

### డయాబెటిస్‌కి కారణాలు:

- పిల్లల్లో మధుమేహం రావడానికి అధిక బరువు లేదా ఊబకాయం ఒక ప్రధాన కారణం కావచ్చు. ఊబకాయం కారణంగా.. శరీరం ఇన్సులిన్‌ను సరిగ్గా ఉపయోగించుకోలేకపోతుంది. దీని కారణంగా రక్తంలో చక్కెర స్థాయి పెరుగుతుంది.
- పిల్లలు శారీరకంగా తక్కువగా చురుకుగా ఉంటే, ఈ పరిస్థితిలో కూడా డయాబెటిస్ ప్రమాదం పెరుగుతుంది. తక్కువ శారీరక శ్రమ మధుమేహం ప్రమాదాన్ని పెంచుతుంది.
- కుటుంబంలో తల్లిదండ్రులు, తాతామామలు లేదా తోబుట్టువులకు డయాబెటిస్ ఉంటే, పిల్లలకు ఈ వ్యాధి వచ్చే ప్రమాదం పెరుగుతుంది.



## ఐటీ హబ్ కాదు.. హాస్పిటలే!

హైదరాబాద్, నవంబర్ 13 (ఈవార్తలు): వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ఐటీ హబ్ కోసం వాడుతారంటూ జరుగుతున్న ప్రచారాన్ని ప్రభుత్వం ఖండించింది. త్వరలోనే ఈ భవనం అందుబాటులోకి వస్తుందని, నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తోందని స్పష్టం చేసింది. సనత్ నగర్ టిమ్స్‌ను కూడా త్వరలోనే ప్రారంభిస్తామని మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్ర కుమార్ స్పష్టంచేశారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.




## ఫ్లాష్: కాంత సినిమా రివ్యూ

అన్నిసార్లు మనం పర్ఫెక్ట్ అని కాదు.. కొన్నిసార్లు తెలియకుండానే తప్పులు జరుగుతుంటాయి. దుల్కర్ సల్మాన్ కు అలా జరిగిందే కాంతా. ఆయన నుంచి వచ్చిన రేర్ మిస్టేక్ ఇది. ఇందులోనూ పెర్ఫార్మెన్స్ పరంగా ఢోకా లేదు.. కానీ కథలోనే విషయం లేదు. చాలా నీరసంగా సాగే కథనం సహనానికి పరీక్ష. మరీ ముఖ్యంగా ఫస్టాఫ్ మహానటి మళ్ళీ చూస్తున్నట్టే ఉంటుంది. దుల్కర్, భాగ్యశ్రీ సీన్స్ అన్నీ.. జెమిని గణేషన్, సావిత్రి సీన్స్ గుర్తుకు తెస్తాయి. ఇంటర్వెల్ ట్విస్ట్ బాగున్నా.. సెకండాఫ్ కూడా అంతంతమాత్రమే. అప్పటి వరకు ఉన్న డ్రామా కాస్తా.. రానా రాగానే థ్రిల్లర్ కు షిఫ్ట్ అవుతుంది. ఒకేచోట జరగడం మూలానో ఏమో గానీ కథ కూడా అక్కడక్కడే ఉన్నట్టు అనిపిస్తుంది. గురు శిష్యుల ఇగో మీద నడిచే కథ ఇది. కానీ వాళ్లిద్దరి మధ్య దూరం పెరగడానికి సరైన రీజన్ ఇవ్వలేదు దర్శకుడు సెల్వరాజ్ సెల్వమణి. దుల్కర్ అద్భుతంగా నటించాడు.. మరీ ముఖ్యంగా క్లైమాక్స్ లో నటన అద్భుతం. భాగ్యశ్రీ బోర్సే కూడా బాగా నటించింది. రానా దగ్గుబాటి క్యారెక్టర్ ఎంటర్టైనింగ్ గా ఉంది. సముద్రఖని నటన ఆకట్టుకుంది. ఇందులో మేజర్ ప్లస్ పాయింట్ ఆర్ట్ డిపార్ట్మెంట్. అలాగే సినిమాటోగ్రఫీ కూడా బాగుంది.. 1950స్ పీరియడ్ బాగా చూపించారు. దర్శకుడు సెల్వరాజ్ సెల్వమణి అంతగా ఆకట్టుకోలేదు.

**ఓవరాల్‌గా కాంతా.. రెట్రో ఫీల్ ఉంది.. లోపల మ్యాటర్ లేదు**

సమీక్షకుడు: ప్రవీణ్ కుమార్, సీనియర్ ఫిల్మ్ జర్నలిస్టు

## టెన్త్ విద్యార్థుల పరీక్ష ఫీజు కడతా

**బండి సంజయ్ బాటలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి.. హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌కు లేఖ రాసిన కేంద్ర మంత్రి**



హైదరాబాద్, నవంబర్ 13 (ఈవార్తలు): కేంద్ర మంత్రి, బీజేపీ సీనియర్ నాయకుడు కిషన్ రెడ్డి.. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ బాటలో నడిచారు. బండి సంజయ్‌ను ఫాలో అవుతూ.. తాను కూడా టెన్త్ విద్యార్థుల ఫీజులు చెల్లిస్తానని తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులందరి పరీక్ష ఫీజులను తన వ్యక్తిగత వేతనం నుంచి చెల్లిస్తానని స్పష్టం చేశారు. పేద విద్యార్థుల విద్యకు ఆర్థికపరమైన ఇబ్బందులు తలెత్తకూడదనే ఉద్దేశంతో, అంత్యోదయ స్ఫూర్తితో ఈ నిర్ణయం తీసుకున్నట్లు కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ విషయమై ఆయన హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌కు ఒక లేఖ రాశారు. నియోజకవర్గంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులెందరు ఉన్నారో, ఎంత మొత్తం అవసరమో తెలియజేయాలని కోరారు. వారం క్రితం కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కూడా తన నియోజకవర్గంలోని పదో తరగతి విద్యార్థుల పరీక్ష ఫీజును చెల్లించారు.



## నెక్స్ట్ అధికారం మనదే

**కేటీఆర్‌తో ప్రభాస్ పెద్దమ్మ వ్యాఖ్యలు.. వివాహ వేడుకలో తారసపడ్డ ఇరువురు**

**ధన్యవాదాలు తెలిపిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్**

హైదరాబాద్, నవంబర్ 13 (ఈవార్తలు): 'నెక్స్ట్ అధికారం మనదే' అని ప్రముఖ నటుడు ప్రభాస్ పెద్దమ్మ శ్యామలదేవి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో అన్నారు. ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. వీరిద్దరు ఒక వివాహ వేడుకలో కలుసుకున్నారు. ఆ సమయంలో శ్యామలదేవి ఈ వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్ నగరంలో జరిగిన ఓ వివాహ వేడుకకు హాజరైన శ్యామలదేవి బయటకు వస్తుండగా, కేటీఆర్ అక్కడికి చేరుకోవడంతో ఇరువురూ ఎదురుపడ్డారు. ఈ సందర్భంగా వారు కొద్దిసేపు మాట్లాడుకున్నారు. శ్యామలదేవి 'నెక్స్ట్ అధికారం మనదే' అని అనగా, కేటీఆర్ నమస్కరిస్తూ ధన్యవాదాలు తెలిపారు. గట్టిగా వినబడనప్పటికీ, వీడియోలో ఆమె వ్యాఖ్యలు స్పష్టంగా వినిపించాయి. అనంతరం.. కేటీఆర్ ఆమెను లోనికి వస్తున్నారా (వివాహ వేడుకకు) లేక వెళుతున్నారా? అని అడగగా, తాను వెళ్లి వచ్చానని శ్యామలదేవి సమాధానమిచ్చారు. అనంతరం, అమ్మానాన్నతో సహా అందరినీ అడిగినట్లు చెప్పండని కేటీఆర్‌తో శ్యామలాదేవి అన్నారు. ఇరువురు కలిసి మీడియా ఫోటోగ్రాఫర్లకు ఫోజులిచ్చారు.

### 75 వేల లంచం.. పట్టుబడ్డ టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్

ఆదిభట్ల/హైదరాబాద్, నవంబర్ 13 (ఈవార్తలు): రూ.75 వేలు లంచం తీసుకుంటూ ఓ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ రెడ్ హ్యాండెడ్‌గా ఏసీబీకి పట్టుబడ్డాడు. రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు గురువారం సోదాలు చేశారు. మున్సిపల్ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ వరప్రసాద్, అసిస్టెంట్ వంశీ కలిసి రూ.75 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు వారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇల్లు నిర్మాణానికి పర్మిషన్ నిమిత్తం ఈ డబ్బులు వసూలు చేసినట్లు అధికారులు నిర్ధారించారు.

### టెన్త్ పరీక్షల ఫీజు గడువు పెంపు

హైదరాబాద్, నవంబర్ 13 (ఈవార్తలు): రాష్ట్రంలో పదో తరగతి పరీక్షల నిర్వహణకు సంబంధించిన ప్రక్రియ కొనసాగుతోంది. ఈ క్రమంలో పదో తరగతి పరీక్షల ఫీజు చెల్లింపు గడువును పాఠశాల విద్యాశాఖ పొడిగించింది. ఈ నెల 20వ తేదీ వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా పరీక్ష ఫీజు చెల్లించొచ్చని పేర్కొంది. ఈ మేరకు ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఆలస్య రుసుము రూ.50తో ఈ నెల 21 నుంచి 29 వరకు అవకాశం కల్పించింది. రూ.200 లేట్ ఫీజుతో డిసెంబర్ 2 నుంచి 11 వరకు అవకాశం ఇచ్చింది. రూ.500 ఆలస్య రుసుముతో డిసెంబర్ 15 నుంచి 29 వరకు అవకాశం కల్పిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొంది.

## ఉత్తర తెలంగాణపై చలి పంజా



హైదరాబాద్, నవంబర్ 13 (ఈవార్తలు): తెలంగాణను చలి వణికిస్తోంది. ఈ ఏడాది శీతాకాలం ప్రారంభం నుంచే చలి తీవ్రత ప్రారంభమైంది. గత వారం రోజులుగా రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు భారీగా పడిపోతున్నాయి. కొన్ని చోట్ల సింగిల్ డిజిట్, చాలా ప్రాంతాల్లో 12 డిగ్రీల కంటే తక్కువగా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాలైన ఆదిలాబాద్, కరీంనగర్, రాజన్నసిరిసిల్లలో అత్యంత కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణీలో అత్యంత కనిష్టంగా 8.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 8.2 నుంచి 15.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రాబోయే రెండు రోజులు రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2-3 డిగ్రీల వరకు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ నవంబర్‌లో గతం కంటే ఎక్కువ చలి తీవ్రత ఉంటుందని తెలిపింది. హైదరాబాద్‌లో శుక్రవారం కొన్ని చోట్ల 10-11 డిగ్రీలు ఉష్ణోగ్రతలు నమోదవుతాయని పేర్కొంది. రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పడిపోయే అవకాశం ఉన్నట్లు వెల్లడించింది. సుమారు 7-10 డిగ్రీలు ఉష్ణోగ్రతలు ఉంటాయని పేర్కొంది. గరిష్ట ఉష్ణోగ్రతలు 30 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రతలు 16 డిగ్రీలుగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

## ఎస్ఎల్‌బీసీ నిర్మాణ సంస్థ ఎండీ అరెస్టు

న్యూఢిల్లీ: మనీల్యాండరింగ్ కేసులో జేపీ ఇన్‌ఫ్రాటెక్ ఎండీ మనోజ్ గౌర్‌ను ఇవాళ ఈడీ అధికారులు అరెస్టు చేశారు. జైప్రకాశ్ అసోసియేట్స్ లిమిటెడ్ సంస్థకు గతంలో మాజీ ఎగ్జిక్యూటివ్ చైర్మెన్, సీఈవోగా చేశారాయన. జేపీ ఇన్‌ఫ్రాటెక్ సంస్థకు మాజీ చైర్మెన్, ఎండీగా కూడా చేశారు. ఢిల్లీ, యూపీకి చెందిన ఆర్థిక నేర శాఖ దాఖలు చేసిన కేసు ఆధారంగా జేపీ గ్రూపుపై ఈడీ తనిఖీలు నిర్వహిస్తున్నది. జేపీ విష్‌టౌన్, జేపీ గ్రీన్స్ ప్రాజెక్ట్స్ వద్ద ఇండ్లు ఖరీదు చేసిన వారు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఈడీ విచారణ కొనసాగిస్తున్నది. ఆ కంపెనీ చీటింగ్‌కు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. సుమారు 12 వేల కోట్ల మేర మనీల్యాండరింగ్‌కు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. పీఎంఎల్‌ఏ చట్ట కింద గౌర్‌ను అరెస్టు చేశారు. ఇండ్లు ఖరీదు చేసిన వారి డబ్బులను దుర్వినియోగం చేసినట్లు తెలుస్తోంది. ఆ నిధులను దారిమళ్లించినట్లు ఆరోపణలు ఉన్నాయి. మన ఎస్ఎల్‌బీసీ టన్నెల్ నిర్మాణ పనులను కూడా ఈ కంపెనీకే ప్రభుత్వం అప్పగించింది.

## ఏఐ ముందు చదువు చచ్చిపోయింది

### విద్యార్థులారా నిద్రలేవండి: ఆర్జీవీ



హైదరాబాద్, నవంబర్ 13 (ఈవార్తలు): ప్రముఖ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ కృత్రిమ మేధస్సు (ఏఐ) విప్లవంపై కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత విద్యా వ్యవస్థ పూర్తిగా "చనిపోయింది" అంటూ ఓ ట్వీట్ చేశారు. 'విద్యార్థులారా మేల్కొండి.. ఏఐ విప్లవం ముందు విద్య చచ్చిపోయింది' అని వ్యాఖ్యానించారు. ప్రస్తుత విద్యా విధానం పూర్తిగా కాలం చెల్లినదని, దానిపై పునరాలోచించాల్సిన సమయం ఆసన్నమైందని వర్మ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. కేవలం జ్ఞాపకశక్తిపై ఆధారపడిన చదువులకు ఇక విలువ ఉండదని స్పష్టం చేశారు. 'ఒకే ఒక్క క్లిక్‌తో లక్షల కేసులను విశ్లేషించి ఏఐ చికిత్స సూచించగలిగినప్పుడు, విద్యార్థులు పదేళ్ల పాటు విషయాలను గుర్తుపెట్టుకోవడానికి ఎందుకు సమయం వృథా చేయాలి?' అని సూటిగా ప్రశ్నించారు. భవిష్యత్ తరాల విద్య పుస్తకాల్లోని సమాచారాన్ని బట్టీ పట్టడం కాదని, ఏఐ పరికరాలను సృజనాత్మకంగా ఎలా ఉపయోగించుకోవాలో నేర్చుకోవడంలోనే ఉందని ఆర్జీవీ అభిప్రాయపడ్డారు. విశ్వవిద్యాలయాలు, విద్యా బోర్డులు మారే వరకు ఏఐ వేచి చూడదని, మార్పును అందిపుచ్చుకోలేని వ్యవస్థలను అది చెరిపేస్తుందని హెచ్చరించారు. పాఠశాలలు సైతం తమ బోధన పద్ధతులను మార్చుకుని, పరీక్షల్లో ఏఐని ఒక సహాయక సాధనంగా అనుమతించాలని సూచించారు. 'ఏఐ మిమ్మల్ని చంపదు, కేవలం పట్టించుకోదు' అని వ్యాఖ్యానించిన వర్మ.. ఏఐని వాడలేని వారు భవిష్యత్తులో ఏఐ చేతనే వాడబడతారని హెచ్చరించారు.

## సోషల్ వాణి



ముస్లింలందరినీ కోటీశ్వరులను
చేసిండంట, అక్కడ అరకులో కాఫీ
కనిపెట్టిండంట.. ఇక్కడ బిర్యానీ ప్రమోట్
చేసిండంట.. గమ్మత్తేమిటంటే ముత్యాల
వ్యాపారాన్నీ ఈయనగారే ప్రమోట్
చేశాడట.. దేవుడా.. ఇట్లా అంటుంటే..
తెలంగాణ మేధావులనబడే వాళ్ల నోళ్లు
ఏమయితున్నయి.. రాజకీయాల కోసం
తెలంగాణ ఆత్మగౌరవాన్ని తాకట్టు
పెడతరా?

– కోవెల సంతోష్ కుమార్

# ఐదేళ్లలోపు 'బాల(లకు) భరోసా'

**8 లక్షల మంది చిన్నారులకు ఉచిత వైద్య సేవలు.. అనారోగ్య సమస్యలకు శస్త్రచికిత్సలు సహా పూర్తి చికిత్స.. ఆరోగ్యశ్రీ, సీఎం సహాయ నిధికి అనుసంధానం**



హైదరాబాద్, నవంబర్ 13 (ఈవార్తలు): రాష్ట్ర ప్రభుత్వం కీలక పథకం అమలుకు ముందడుగు వేసింది. ఐదేళ్లలోపు చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా 'బాల భరోసా' అనే సరికొత్త పథకానికి శ్రీకారం చుడుతోంది. ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తం గా ఉన్న చిన్నారులకు ఉచితంగా మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సన్నాహాలు పూర్తి చేసింది. త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు. రాష్ట్రంలోని చిన్నారుల ఆరోగ్య స్థితిగతులపై ఇటీవల అంగన్‌వాడీ సిబ్బంది ద్వారా ప్రభుత్వం ఒక సర్వే నిర్వహించింది. ఈ సర్వేలో సుమారు 8 లక్షల మంది చిన్నారులు వివిధ రకాల అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు తేలింది. వీరిలో కొందరు రక్తహీనత, పోషకాహార లోపంతో బాధపడుతుండగా, మరికొందరు వినికిడి, దృష్టి లోపాలు, వయసుకు తగిన ఎదుగుదల లేకపోవడం వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఇలా గుర్తించిన చిన్నారులందరికీ అండగా నిలిచేందుకే ప్రభుత్వం 'బాల భరోసా' పథకాన్ని రూపొందించింది. ఈ పథకం కింద వైకల్యంతో బాధపడే చిన్నారులకు ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహిస్తారు. వినికిడి లోపం ఉన్నవారికి అవసరమైన పరికరాలను అందిస్తారు. దీంతో పాటు ఇతర వైద్య సేవలను కూడా పూర్తిగా ఉచితంగా కల్పిస్తారు. మహిళా శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖలు సంయుక్తంగా ఈ పథకాన్ని పర్యవేక్షించనున్నాయి. 'బాల భరోసా' పథకాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రభుత్వం దీనిని ఆరోగ్యశ్రీకి అనుసంధానించాలని నిర్ణయించింది. ఒకవేళ ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని వ్యాధులుంటే, వాటి చికిత్స ఖర్చులను ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి చెల్లించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ పథకమైన రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమాన్ని కూడా ఈ పథకంలో విలీనం చేయనున్నారు. ఈ పథకం అమలును పర్యవేక్షించేందుకు తెలంగాణ సర్కార్ ఒక ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేస్తోంది. దీని ద్వారా ప్రతి చిన్నారి వైద్య చరిత్ర, వారికి అందిస్తున్న చికిత్స, దాని పురోగతిని ఎప్పటికప్పుడు ట్రాక్ చేస్తారు. ఈ బృహత్తర పథకం విజయవంత మైతే, రాష్ట్రంలోని లక్షలాది మంది చిన్నారులకు చిన్న వయసులోనే మెరుగైన వైద్యం అంది, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి బలమైన పునాది పడుతుందని అధికారులు భావిస్తున్నారు.



# ‘ఆర్జిత’ పెంపు ఆగింది!

## కొండగట్టులో పూజల రుసుం పెంపు వాయిదా..

### నిర్ణయాన్ని వాయిదా వేస్తున్నాం: ఆలయ ఈవో

మల్యాల, నవంబర్ 13 (ఈవార్తలు): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో ఆర్జిత సేవల రుసుం పెంపు నిర్ణయాన్ని వాయిదా వేస్తున్నట్టు ఈవో శ్రీకాంత్ రావు తెలిపారు. ఆర్జిత సేవల టికెట్ ధర పెంచడంతో సాధారణ భక్తులపై భారం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తమైంది. ఆలయంలో వసతులు అంతంత మాత్రంగానే ఉన్నా సేవా రుసుం పెంచడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో ఆర్జిత సేవల రుసుం పెంపు నిర్ణయాన్ని అధికారులు వాయిదా వేశారు. వాస్తవానికి అంజన్న దర్శనానికి నిత్యం 20 వేల మంది భక్తులు వస్తుంటారు. మంగళ, శని, ఆదివారాల్లో ఈ సంఖ్య దాదాపు లక్షకు చేరుకుంటుంది. ‘ఆలయ ప్రాంగణంలో వసతులు అరకొరగానే ఉంటాయి. కోనేరు పరిశుభ్రంగా ఉండే సందర్భాలు చాలా తక్కువ. ఆలయ పరిసరాలు కూడా శుభ్రంగా ఉండవు. వాటర్ ట్యాంక్ పరిసరాల్లో చెత్తాచెదారం నిండి ఉంటుంది. అయినా భక్తులను దోపిడీ చేసేందుకే నిర్వాహకులు ఆర్జిత సేవల రుసుం పెంచాలని నిర్ణయించారు. ఒత్తిడితో నిర్ణయాన్ని వాయిదా వేసుకున్నారు’ అని భక్తులు అసహనం వ్యక్తం చేశారు.

**కేంద్ర మంత్రి బండి సంజయ్ చొరవ**

అంజన్న ఆలయంలో ఆర్జిత సేవల రుసుం పెంచుతూ నిర్ణయం తీసుకోవడంపై బీజేపీ మల్యాల మండల అధ్యక్షుడు గాజుల మల్లేశం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని కేంద్ర మంత్రి బండి సంజయ్ దృష్టికి తీసుకెళ్లారు. దాంతో.. ఆ నిర్ణయంపై కేంద్ర మంత్రి మండిపడ్డారు. దేవాదాయ శాఖ అధికారులతో మాట్లాడి ఆర్జిత సేవల రుసుం పెంచడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ‘దేవాలయాల్లో దర్శనం నుండి దేవుడి సేవ వరకు, దేవాలయ ప్రాంగణంలో పార్కింగ్ దగ్గరి నుండి ప్రసాదం వరకు అన్నింటినీ దేవాదాయ శాఖ ఆదాయ మార్గాలుగా మార్చేసింది. దైవ దర్శనం కోసం వచ్చే భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించడం మీద స్పృహ ఉండదు కానీ భక్తుల మీద భారం మోపి, డబ్బులు దండుకోవడానికి మాత్రం రకరకాల మార్గాలను అన్వేషిస్తుంది. తాజాగా కొండగట్టు అంజన్న దేవాలయంలో ఆర్జిత సేవల రుసుములను దాదాపు రెట్టింపు చేస్తూ దేవాదాయ శాఖ తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నాను. ఇదే అంశంపై దేవాదాయ శాఖ అధికారులతో ఫోన్ మాట్లాడాను. కొండగట్టులో సౌకర్యాల లేమి, భక్తులకు కలుగుతున్న ఇబ్బందులపై దృష్టి పెట్టకుండా, రుసుములు పెంచడం ఏంటని ప్రశ్నించా. కొండగట్టు క్షేత్రానికి వచ్చే భక్తుల నుంచి అడ్డగోలుగా రుసుములను పెంచడం కాదు. అంజన్న దర్శనానికి వచ్చే భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించా’ అని పేర్కొన్నారు.



# ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి: రాంలింగారెడ్డి

మల్యాల, నవంబర్ 13 (ఈవార్తలు): ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని సిబ్బందికి ప్యాక్స్ చైర్మన్ ముత్యాల రాంలింగారెడ్డి సూచించారు. గురువారం మల్యాల మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఆయన.. రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. సంబంధిత అధికారులు, రైస్ మిల్లుల యాజమాన్యంతో మాట్లాడి.. త్వరగా ధాన్యం దిగుమతి చేసుకోవాలని పేర్కొన్నారు.

# మల్యాల నూతన ఎంపీవోగా ఆమని

మల్యాల, నవంబర్ 13 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండల నూతన సంచాయతీ అధికారిగా బీ ఆమని బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీల అభివృద్ధి, పరిశుభ్రత, హరితహారం, శానిటేషన్ వంటి కార్యక్రమాలపై దృష్టి సాధించనున్నట్లు తెలిపారు.



# చివరి గింజ వరకు కొనాలి

## రైతులను ఇబ్బందులు పెట్టొద్దు.. సమస్యలను పైఅధికారుల దృష్టికి తేవాలి.. అధికారులకు మంత్రి అడ్లూరి ఆదేశాలు

జగిత్యాల టౌన్, నవంబర్ 13 (ఈవార్తలు): వడ్ల కొనుగోలుకు సంబంధించి ప్రత్యేకంగా రైతుల నుండి చివరి గింజవరకు ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలో ధాన్యం కొనుగోలుపై జగిత్యాల, కోరుట్ల ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్ కుమార్, డాక్టర్ సంజయ్, కలెక్టర్ బీ సత్య ప్రసాద్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ధాన్యం సేకరణలో జగిత్యాల జిల్లాకు సంబంధించి ఎంత ధాన్యాన్ని సేకరించారు అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో వరి మీదనే ఎక్కువగా రైతులు ఆధార పడ్డారని, వారికి ఎటువంటి సమస్యలు రాకుండా ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని తెలిపారు. గన్నీ సంచులు, టార్ఫాలిన్ కవర్లు, వివిధ రకాల యంత్రాలు అందుబాటులో ఉండే విధంగా చూసుకోవాలని అధికారులకు సూచించారు. అకాల వర్షాల వల్ల ధాన్యం తడిచిందని, తడిచిన ధాన్యాన్ని గంటలో అరబెట్టే 3 మిషన్లను జగిత్యాల, కోరుట్ల, ధర్మపురికి కేటాయించినట్లు తెలిపారు. అవసరమైతే ఇంకా తెప్పిస్తామని.. అందుకోసం ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో క్లస్టర్ అధికారులు, జిల్లా అధికారులు, ఆర్డీఓలు, అదనపు కలెక్టర్ రెవెన్యూ ప్రతి రోజు సెంటర్లను సందర్శించాలని, సెంటర్లలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు సూచనలు చేస్తూ ధాన్యం కొనుగోలు సజావుగా జరిగేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం పంట సాగు పెరుగుతోందని, గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సమన్వయం చేసుకుంటూ ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ మాట్లాడుతూ ఇప్పటివరకు రోజుకు 5 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేస్తున్నారని, దానికి 15 వేల మెట్రిక్ టన్నుల వరకు పెంచితే ఆలస్యం కాకుండా వేగవంతంగా ధాన్యం కొనుగోలు జరుగుతుందని తెలిపారు. కౌలు రైతులకు సంబంధించి ధాన్యం కొనుగోలులో కొన్ని ఇబ్బందులు ఉన్నాయని వాటిని పరిష్కరించాలని కోరారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు బీఎస్ లత, రాజాగౌడ్, జగిత్యాల, మెట్‌పల్లి ఆర్డీవోలు మధుసూదన్, శ్రీనివాస్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కన్నం హరిణి, వివిధ శాఖల అధికారులు, క్లస్టర్ అధికారులు, ప్యాక్స్ చైర్మన్లు, రైస్ మిల్లర్ల అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# మద్దుట్లలో ధాన్యం కాంటా


## కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మేడిపెల్లి సత్యం

మల్యాల, నవంబర్ 13 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండలం మద్దుట్లలో ప్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు శ్రమించి పండించిన ప్రతి ధాన్యాన్ని ప్రభుత్వం పూర్తిగా కొనుగోలు చేస్తుందని అన్నారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి, ప్రభుత్వం నిర్ణయించిన గిట్టుబాటు ధరలు పొందాలని చెప్పారు. రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఎవరూ ఇబ్బందులు పడకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బత్తిని మల్లీశ్వరి శ్రీనివాస్, దారం ఆదిరెడ్డి, వెల్మ లక్ష్మారెడ్డి, రమేశ్, అరుణ్ రావు, పోతాని రవి, నక్క అనిల్, కోరేపు వెంకటేష్, మర్రి లక్ష్మణ్ తదితరులుపాల్గొన్నారు.

# చంద్రబాబుతో తైవాన్ బృందం భేటీ

## పరిశ్రమల స్థాపనకు ఎంవోయూలు

అమరావతి, నవంబర్ 13 (ఈవార్తలు): తైవాన్ కంపెనీల పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పూర్తి సహకారం అందిస్తుందని ఏపీ సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. పెట్టుబడులు, పరిశ్రమలకు అత్యంత అనుకూల రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దుతున్నామని తైవాన్ ప్రతినిధి బృందానికి ముఖ్యమంత్రి తెలిపారు. పెట్టుబడుల సదస్సులో భాగంగా భారత్‌లో తైపీ ఎకనామిక్ అండ్ కల్చర్ సెంటర్ ప్రతినిధి, రాయబారి ముమిన్ చెన్ నేతృత్వంలోని తైవాన్ ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ అయ్యారు. వివిధ రంగాల్లో వచ్చే ప్రాజెక్టులకు అనుకూలంగా ఏపీలో పారిశ్రామిక కారిడార్లను తీర్చిదిద్దుతున్నామని ముఖ్యమంత్రి తైవాన్ బృందానికి వివరించారు. నైపుణ్యం ఉన్న మానవ వనరులు, ప్రపంచస్థాయి ప్రమాణాలతో మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని తెలిపారు. తైవాన్ కంపెనీలు ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్లు, గ్రీన్ ఎనర్జీ, ఎలక్ట్రిక్ వాహనాల తయారీ, ఈవీ బ్యాటరీ తదితర రంగాల్లో ఏపీతో కలిసి పని చేయాలని ముఖ్యమంత్రి తైవాన్ కంపెనీలను ఆహ్వానించారు. ఇండో - తైవాన్ ఇండస్ట్రియల్ పార్క్‌ను కుప్పంలో ఏర్పాటు చేసేందుకు ఆసక్తిగా ఉన్నట్టు తైవాన్ ప్రతినిధి బృందం తెలిపింది. అలీజియన్స్ గ్రూప్ రూ.400 కోట్ల వ్యయంతో ఈ పారిశ్రామిక పార్క్ ఏర్పాటు చేసేందుకు సిద్ధమని ముఖ్యమంత్రికి తెలిపింది. పాద రక్షల తయారీ కంపెనీ పౌ చెన్ గ్రూప్ ఫుట్ వేర్ యూనిట్ ను కుప్పంలో ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చింది. ఓర్వకల్లులో ఇమేజ్ సెన్సార్లను ఉత్పత్తి చేసేందుకు తైవాన్‌కు చెందిన క్రియేటివ్ సెన్సార్ ఇంక్ సంస్థ ఆసక్తి వ్యక్తం చేసింది. సెమీకండక్టర్ మిషన్ కింద ప్రోత్సాహకాలు అందించేందుకు సహకరించాలని కోరింది. ఓర్వకల్లు సమీపంలోనే ఇ-జౌల్ ఇండియా జాయింట్ వెంచర్ సంస్థ అడ్వాన్స్ బ్యాటరీ తయారీ యూనిట్ ఏర్పాటుకు కూడా ముందుకు వచ్చింది. 2.2 బిలియన్ డాలర్ల పెట్టుబడితో 23 గిగావాట్ల సామర్థ్యంతో సాలిడ్ స్టేట్ బ్యాటరీ, కాథోడ్ యాక్టివ్ మెటీరియల్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నట్టు సంస్థ ప్రతిపాదించింది. వీటికి సంబంధించి ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో తైవాన్ కంపెనీల ప్రతినిధులు- ఈడీబీ ఒప్పందాలు చేసుకున్నారు. తైవాన్ కంపెనీలు ఏర్పాటు చేస్తున్న పారిశ్రామిక పార్క్‌కు భూములు కేటాయిస్తామని సీఎం స్పష్టం చేశారు. పారిశ్రామిక పార్కులకు వివిధ



రహదారులను అనుసంధానిస్తామని పేర్కొన్నారు. కర్ణాటక, ఏపీ, తమిళనాడు రీజియన్లను కలుపుతూ ఈ రహదారి మార్గాలు ఉన్నాయని తైవాన్ ప్రతినిధులకు వివరించారు. ఇండియా సెమీ కండక్టర్ మిషన్ పాలసీలో భాగంగా ప్రోత్సాహకాలకు సంబంధించిన నిర్ణయాలు త్వరలోనే కేంద్రం విడుదల చేస్తుందని ముఖ్యమంత్రి వివరించారు. తైవాన్ కంపెనీలకు అవసరమైన నైపుణ్యం ఉన్న మానవ వనరుల్ని తయారు చేసేందుకు సిద్ధమని సీఎం వెల్లడించారు. తైవాన్ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ను కూడా ఏపీలో ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి కోరారు. ఏపీలో పరిశ్రమలు, పెట్టుబడులకు సంబంధించిన అంశాల్లో ప్రభుత్వ సహకారం బాగుందని తైవాన్ బృందం కొనియాడింది. ఆంధ్రప్రదేశ్లో ఇటాలియన్ కంపెనీలు పెట్టుబడులు పెట్టేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆ దేశ రాయబారి ఆంటోనియో ఎన్రికో బార్టోలీని కోరారు. విశాఖపట్నంలోని %జ××% భాగస్వామ్య సదస్సు సందర్భంగా వివిధ దేశాల రాయబారులతో సీఎం చంద్రబాబు భేటీ అవుతున్నారు. ఈ భేటీల్లో భాగంగా గురువారం భారతదేశంలోని ఇటలీ రాయబారితో సమావేశమయ్యారు. రాష్ట్రంలో ఏయే రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు అవకాశాలు ఉన్నాయనే విషయాన్ని ముఖ్యమంత్రి బార్టోలీకి వివరించారు. కీలక రంగాలైన ఆటోమోటివ్, ఆటో విడిభాగాలు, యంత్రాల తయారీ, ఇంధన, ఫ్యాషన్, ఆహార శుద్ధి వంటి రంగాల్లో పెట్టుబడులపై ముఖ్యమంత్రి-ఇటలీ రాయబారి మధ్య చర్చలు జరిగాయి. ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ యంత్రాలు, పునరుత్పాదక విద్యుత్ రంగం, నౌకానిర్మాణ రంగాలలో భాగస్వాములు కావాలని ఇటాలియన్ కంపెనీలను ముఖ్యమంత్రి ఆహ్వానించారు. ఏపీ-ఇటలీ మధ్య దీర్ఘకాలిక వాణిజ్యం, పెట్టుబడి సంబంధాలను మరింత బలోపేతం చేయడానికి ఆంధ్రప్రదేశ్‌లో ఒక ఇటాలియన్ ఇండస్ట్రియల్ క్లస్టర్ ను ఏర్పాటు చేసే అంశంపై సీఎం చంద్రబాబు-ఇటలీ రాయబారి బార్టోలీ మధ్య చర్చలు జరిగాయి.

# ఎర్రచందనంపై ఆపరేషన్ అరణ్య

## పవన్ కల్యాణ్ ట్వీట్‌తో తీవ్రచర్చ

అమరావతి, నవంబర్ 13 (ఈవార్తలు): జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేసిన ఒక ట్వీట్ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఆపరేషన్ అరణ్య అనే హ్యాష్‌ట్యాగ్‌తో ఆయన పెట్టిన పోస్ట్, ఎర్రచందనం స్మగ్లింగ్‌పై ప్రభుత్వం ఉక్కుపాదం మోపడానికి సిద్ధమవుతోందనే బలమైన సంకేతాలను ఇస్తోంది. శేషాచలం, తూర్పు కనుమల్లో సహజ వనరుల దోపిడీపై ఆయన చేసిన వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి. కొంత కాలం క్రితం తాను ‘ది వైల్డ్ ఈస్ట్’ అనే పుస్తకాన్ని చదవడం ప్రారంభించానని, అందులోని వివరాలు తనను తీవ్రంగా ఆశ్చర్యపరిచాయని పవన్ కల్యాణ్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. “వ్యవస్థ కళ్లెదుటే శేషాచలం, తూర్పు కనుమల్లోని ఎర్రచందనం, మన అమూల్యమైన సహజ సంపదను ఎలా దోచుకున్నారో ఈ పుస్తకం కళ్లకు కట్టినట్టు చూపిస్తుంది. రాజకీయం ముసుగులో దాక్కున్న కొందరు నేతలు పూర్తిస్థాయి మాఫియా డాన్లలా ఎలా వ్యవహరించారో ఇది బహిర్గతం చేస్తుంది” అని వివరించారు. పుస్తకంలోని ఒక పాత్ర తనను ప్రత్యేకంగా ఆకట్టుకుందని పవన్ తెలిపారు. “ఓ చిన్నపాటి కాంట్రాక్టర్, అధికార దాహంతో ఎర్రచందనం స్మగ్లింగ్ సామ్రాజ్యానికి అధినేతగా ఎలా మారాడో రచయిత అద్భుతంగా చూపించారు.



# స్కూళ్లలో ఆధార్ అప్‌డేట్.. 17 నుంచి క్యాంపులు

అమరావతి, నవంబర్ 13 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలోని విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఒక ముఖ్యమైన ప్రకటన జారీ చేసింది. విద్యార్థుల ఆధార్ వివరాలను సులభంగా అప్‌డేట్ చేసుకునేందుకు వీలుగా పాఠశాలల ప్రాంగణాల్లోనే ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ నెల 17వ తేదీ నుంచి 26వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ఈ ఆధార్ అప్‌డేట్ క్యాంపులను ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ డైరెక్టర్ శివప్రసాద్ అన్ని జిల్లాల కలెక్టర్లకు అధికారికంగా లేఖ రాశారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా విద్యార్థుల బయోమెట్రిక్ వివరాలను (వేలిముద్రలు, కంటిపాప) అప్‌డేట్ చేయడంతో పాటు, పేరు, చిరునామా వంటి ఇతర వివరాలలో తప్పులుంటే సరిచేసుకునే అవకాశం కల్పించనున్నారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా, వారు చదువుకునే చోటే ఈ సేవలు పొందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, తమ పిల్లల ఆధార్ వివరాలను తప్పనిసరిగా అప్‌డేట్ చేయించాలని అధికారులు సూచిస్తున్నారు. ఆధార్ వివరాలు సరిగ్గా లేకపోతే భవిష్యత్తులో ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందడంలో సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉందని ప్రభుత్వం హెచ్చరించింది.

# త్వరలో టీటీడీ ఏఐ చాట్‌బాట్!

తిరుమల, నవంబర్ 13 (ఈవార్తలు): శ్రీవారి భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు మరో తీపికబురు అందించింది. టెక్నాలజీని వినియోగించుకుంటూ భక్తులకు మరింత మెరుగైన, సులభమైన సేవలు అందించే దిశగా కీలక నిర్ణయం తీసుకుంది. ప్రముఖ టెక్ సంస్థ అమెజాన్ వెబ్ సర్వీసెస్ భాగస్వామ్యంతో త్వరలోనే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత చాట్‌బాట్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు ప్రకటించింది. ఈ ఏఐ చాట్‌బాట్ ద్వారా భక్తులు శ్రీవారి దర్శనం, వసతి గదుల లభ్యత, విరాళాలు, ఇతర సేవలకు సంబంధించిన సమాచారాన్ని క్షణాల్లో పొందవచ్చు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తుల సౌలభ్యం కోసం ఈ సేవలను ఏకంగా 13 భాషల్లో అందించనున్నారు. అంతేకాకుండా, భక్తులు తమ ఫిర్యాదులను, సలహాలు, సూచనలను కూడా ఈ చాట్‌బాట్ ద్వారా సులభంగా టీటీడీ దృష్టికి తీసుకెళ్లే వెసులుబాటు కల్పించనున్నారు. ఈ చాట్‌బాట్‌లో స్పీచ్ టు టెక్స్ట్, టెక్స్ట్ టు స్పీచ్ వంటి ఆధునిక సదుపాయాలు కూడా ఉండనున్నాయి. దీనివల్ల భక్తులు వాయిస్ కమాండ్ల ద్వారా కూడా సమాచారాన్ని పొందగలరు. ఈ అత్యాధునిక చాట్‌బాట్‌కు అవసరమైన సాఫ్ట్‌వేర్‌ను ప్రముఖ ఐటీ దిగ్గజం టీసీఎస్ అభివృద్ధి చేస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు, టీటీడీ పాలనలో పారదర్శకత పెంచడంతో పాటు, ఎస్వీబీసీ ఛానల్ ప్రసారాలను మరింత మెరుగుపరిచేందుకు కూడా చర్యలు చేపడుతోంది. ఈ కొత్త టెక్నాలజీ రాకతో భక్తులకు సమాచార సేకరణ మరింత సులభతరం కానుంది.

# డాక్టర్ షాహీన్ బ్రెజా కారు స్వాధీనం

## మూడు కార్లతో భారీ విధ్వంసానికి కుట్ర.. టార్గెట్ లిస్టులో అయోధ్య రామాలయం.. టర్కీ కేంద్రంగా దాడికి ప్రణాళిక రచన

న్యూఢిల్లీ: ఢిల్లీ పేలుళ్ల కేసులో ఉగ్రవాదులు ఉపయోగించిన మూడో కారును దర్యాప్తు బృందాలు గుర్తించి, స్వాధీనం చేసుకున్నాయి. ఫరీదాబాద్‌లోని అల్-ఫలాహ యూనివర్సిటీ క్యాంపస్‌లో డాక్టర్ షాహీన్ కు చెందిన మారుతి సుజుకి బ్రెజా కారును పోలీసులు కనుగొన్నారు. ఈ కేసులో ఇప్పటికే ఓల్డ్ ఢిల్లీలో జరిగిన పేలుడు ఘటనకు సంబంధించి డీఎన్ఏ పరీక్షల ద్వారా ఉమర్ ఉన్ నబీ అనే వ్యక్తిని నిందితుడిగా గుర్తించారు. ఈ ఉగ్రవాద మాడ్యూల్ 'స్పెక్టాక్యులర్ టెర్రర్ అటాక్' పేరుతో భారీ విధ్వంసానికి ప్లాన్ చేసింది. దీని కోసం మొత్తం మూడు వాహనాలను సిద్ధం చేసింది. ఈ కార్లతో మొదట ఐఈడీ పేలుళ్లు జరిపి, ఆ తర్వాత అసాల్ట్ రైఫిళ్లతో కాల్పులకు తెగబడాలని కుట్ర పన్నారు. ఇందుకోసం హ్యుందాయ్ ఐ20, రెడ్ ఫోర్డ్ ఎకోస్పోర్ట్, మారుతి బ్రెజా కార్లను సమకూర్చుకున్నారు. వీరి ప్లాన్‌లో భాగంగా ఇప్పటికే ఐ20 కారును ఎర్రకోట సమీపంలో పేల్చివేశారు. మిగిలిన రెండు వాహనాల కోసం పోలీసులు 'బీ ఆన్ ది లుకౌట్' హెచ్చరికలు జారీ చేశారు. వాటిలో మరిన్ని పేలుడు పదార్థాలు ఉండవచ్చనే అనుమానంతో గాలింపు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో, బుధవారం ఫరీదాబాద్‌లో రెడ్ ఫోర్డ్ ఎకోస్పోర్ట్ కారును అధికారులు గుర్తించారు. తాజాగా, డాక్టర్ షాహీన్‌కు చెందిన బ్రెజా కారును యూనివర్సిటీ క్యాంపస్‌లో కనుగొన్నారు. ఈ వాహనాలను సమకూర్చడంలో ఉమర్ ఉన్ నబీ కీలక పాత్ర పోషించినట్లు దర్యాప్తులో తేలింది. లోతుగా దర్యాప్తు చేయగా ఈ మాడ్యూల్ లక్ష్యం కేవలం ఢిల్లీ మాత్రమే కాదని, అయోధ్య కూడా వారి టార్గెట్ లిస్టులో ఉందని తెలిసి అధికారులు అప్రమత్తమయ్యారు. అయోధ్యలోని రామ మందిరంలో నవంబర్ 25న కుంకుమ పతాకావిష్కరణ సందర్భంగా ఉగ్రదాడికి ప్లాన్ చేసినట్లు వెల్లడైంది. ఈ పేలుళ్ల కోసం అమ్మోనియం నైట్రేట్, ఆర్డీఎక్స్ మిశ్రమాన్ని సిద్ధం చేసుకున్నట్లు



గుర్తించారు. ఈ భారీ ఉగ్రకుట్రకు 2022లోనే టర్కీలో బీజం పడినట్లు భద్రతా సంస్థలు తెలిపాయి. టర్కీలోని 'ఉకాసా' అనే హ్యాండ్లర్ మార్గదర్శకత్వంలో ఉమర్ ఈ కుట్రను నడిపినట్లు తేలింది.

# ప్రవాసులకు భద్రత.. మొబిలిటీ బిల్లు

## భారత నిపుణులకు మెరుగైన అవకాశాలు, భద్రత లక్ష్యం.. 1983 నాటి వలస చట్టం స్థానంలో నూతన నిబంధనలు

న్యూఢిల్లీ: పనిచేసేందుకు విదేశాలకు వెళ్లే భారత కార్మికులు, నిపుణుల ప్రయోజనాలను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక అడుగు వేస్తోంది. అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో వలసలపై వ్యతిరేకత పెరుగుతున్న నేపథ్యంలో, భారత ఉద్యోగులకు మెరుగైన అవకాశాలు, భద్రత కల్పించడంతో పాటు, వారు తమ ఉద్యోగ కాలం ముగిశాక తిరిగి స్వదేశానికి వచ్చేలా ప్రోత్సహించేందుకు 'ఓవర్సీస్ మొబిలిటీ (ఫెసిలిటేషన్ అండ్ వెల్ఫేర్) బిల్లు, 2025'ను ప్రతిపాదించింది. ఈ కొత్త బిల్లు కేవలం వలస విధానంలో మార్పు కాదు, ఆర్థిక దౌత్యంలో కార్మిక శక్తిని ఒక మూలస్తంభంగా మార్చే ప్రయత్నం. ఇప్పటివరకు అమల్లో ఉన్న 1983 నాటి పాత వలస చట్టం స్థానంలో ఈ కొత్త బిల్లు సమగ్రమైన చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్‌ను తీసుకురానుంది. ఇది కేవలం విదేశీ ఉపాధిని సులభతరం చేయడమే కాకుండా, ఉద్యోగులు సురక్షితంగా తిరిగి రావడం, స్వదేశంలో వారి పునరేకీకరణకు కూడా భరోసా ఇస్తుంది. బిల్లు ద్వారా భారత ప్రభుత్వం తన కార్మికుల వలసలను కేవలం ప్రేక్షకపాత్రకే పరిమితం చేయకుండా, వారి ఉద్యోగ నిబంధనలపై ఇతర దేశాలతో చురుగ్గా చర్చలు జరుపుతోంది. 2014



నుంచి భారత కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే యూరప్, ఆసియా, గల్ఫ్ ప్రాంతాల్లోని దాదాపు 20 దేశాలతో కార్మిక మొబిలిటీ ఒప్పందాలు కుదుర్చుకుంది. అభివృద్ధి చెందిన దేశాల్లో జనాభా తగ్గి కార్మికుల కొరత ఏర్పడుతుంటే, భారత్ వంటి దేశాల్లో స్థిరమైన జనాభా ఉన్నా ఉద్యోగాల కొరత ఉంది. ఈ సమస్యకు శాశ్వత వలసలు పరిష్కారం కాదు, ఎందుకంటే దీనివల్ల రాజకీయ వ్యతిరేకత వస్తోంది. అందుకే, భారత్ తన నైపుణ్యాలను ఒక నిర్ణీత కాలపరిమితితో ఎగుమతి చేసే మార్గాన్ని ఎంచుకుంది. భారత్ అతిపెద్ద ఆస్తి 25 ఏళ్లలోపు వయసున్న 60 కోట్లకు పైగా యువత కాగా, అభివృద్ధి చెందిన దేశాలు తీవ్రమైన కార్మికుల కొరతను ఎదుర్కొంటున్నాయి. బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ అధ్యయనం ప్రకారం, 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా 4.5 నుంచి 5 కోట్ల మంది కార్మికుల కొరత ఏర్పడనుంది. ఈ నేపథ్యంలో జర్మనీ, జపాన్ వంటి దేశాలు భారతీయ కార్మికుల కోసం చురుగ్గా ప్రయత్నిస్తున్నాయి. ఇప్పటికే భారత్ కుదుర్చుకుంటున్న ఒప్పందాలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. ఉదాహరణకు, భారత్-యూకే సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం ప్రకారం, యూకేలో తాత్కాలికంగా పనిచేస్తున్న భారతీయ ఉద్యోగులు అక్కడి సామాజిక భద్రతా చందాలు చెల్లించకుండా మూడేళ్లపాటు మినహాయింపు పొందారు. దీనివల్ల భారత కంపెనీలకు ఏటా సుమారు రూ.4,000 కోట్ల ఆదా అవుతుందని అంచనా. ప్రతిపాదిత కొత్త బిల్లు వివిధ దేశాల ప్రభుత్వాల మధ్య సమన్వయం పెంచడానికి, అంతర్జాతీయ వలస ఒప్పందాలను పర్యవేక్షించడానికి, డేటా ఆధారిత విధానాలను రూపొందించడానికి దోహదపడుతుంది. అన్నింటికంటే ముఖ్యంగా, విదేశాలకు వెళ్లే భారతీయుల సంక్షేమాన్ని ప్రోత్సహించడానికి, వారి హక్కులను కాపాడటానికి అవసరమైన వ్యవస్థలను ఇది బలోపేతం చేయనుంది.

# టాప్ 25 కంపెనీల్లో 16 భారత్‌లోనే

## 90 లక్షల మంది ఉద్యోగుల సర్వే ఆధారంగా జాబితా.. ఉద్యోగుల నమ్మకం, గౌరవం ఆధారంగా ర్యాంకులు

న్యూఢిల్లీ: ప్రపంచ కార్పొరేట్ రంగంలో భారత్ తనదైన ముద్రను మరింత బలపరుస్తోంది. పని చేయడానికి ప్రపంచంలోనే అత్యుత్తమమైన 25 కంపెనీలలో (ఫార్చ్యూన్ వరల్డ్స్ బెస్ట్ వర్క్‌ప్లేసెస్ 2025) ఏకంగా 16 సంస్థలు భారత్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని తాజా నివేదిక వెల్లడించింది. వర్క్‌ప్లేస్ కల్చర్‌పై ప్రపంచవ్యాప్త అధికారిక సంస్థగా పేరున్న 'గ్రేట్ ప్లేస్ టు వర్క్', ప్రముఖ 'ఫార్చ్యూన్ మీడియా' సంయుక్తంగా ఈ జాబితాను గురువారం విడుదల చేశాయి. ఈ జాబితా రూపకల్పన కోసం 2024, 2025 సంవత్సరాల్లో ప్రపంచవ్యాప్తంగా 90 లక్షల మందికి పైగా ఉద్యోగుల నుంచి అభిప్రాయాలను సేకరించారు. ఈ సర్వే సుమారు 2.5 కోట్ల మంది ఉద్యోగుల అనుభవాలకు ప్రాతినిధ్యం వహిస్తోంది. ఉద్యోగుల నమ్మకం, వారు చేసే పని పట్ల గర్వం, సహోద్యోగులతో స్నేహపూర్వక వాతావరణం వంటి అంశాల్లో స్థానికంగా, ప్రపంచవ్యాప్తంగా అద్భుతమైన పనితీరు కనబరిచిన కంపెనీలకు ఈ జాబితాలో ఉన్నత ర్యాంకులు లభించాయి. ఈ ఘనతపై గ్రేట్ ప్లేస్ టు వర్క్ ఇండియా సీఈఓ బల్బీర్ సింగ్ హర్షం వ్యక్తం చేశారు. "గుర్తింపు పొందిన 25 సంస్థలలో 16 కంపెనీలు భారత్‌లో బలంగా కార్యకలాపాలు సాగిస్తున్నాయి. ఇది ప్రపంచ వర్క్‌ప్లేస్ కల్చర్‌ను తీర్చిదిద్దడంలో భారత్ పోషిస్తున్న కీలక పాత్రకు నిదర్శనం. ఈ జాబితాలో విజేతలుగా నిలిచిన వారందరికీ నా హృదయపూర్వక అభినందనలు. వీరు ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు" అని ఆయన అన్నారు. ఈ జాబితాలోని కంపెనీలు గొప్ప కార్పొరేట్ సంస్కృతికి సరిహద్దులు లేవని నిరూపిస్తున్నాయని నిపుణులు అభిప్రాయపడ్డారు. నమ్మకం, న్యాయబద్ధతతో సంస్థలను నడిపినప్పుడు, ఉద్యోగులు, పనితీరు రెండూ విశ్వవ్యాప్తంగా అభివృద్ధి చెందుతాయని గ్రేట్ ప్లేస్ టు వర్క్ గ్లోబల్ సీఈఓ మైఖేల్ సి. బుష్ తెలిపారు. "ఈ గొప్ప కంపెనీలు మన గ్రహంపై చూపే ప్రభావం ఒక పవిత్రమైన బాధ్యత. సర్వేలో పాల్గొన్న 90 లక్షల మంది ఉద్యోగులలో, ఈ సంస్థల్లో పనిచేస్తున్న వారు తమను కంపెనీ నమ్ముతుందని, తాము వృత్తి పరంగా, వ్యక్తిగతంగా ఎదగాలని కోరుకుంటుందని చెప్పారు," అని ఆయన వివరించారు. ఫార్చ్యూన్ ఎడిటర్-ఇన్-చీఫ్ అలిసన్ షోన్‌టెల్ మాట్లాడుతూ, ఈ జాబితా ఉద్యోగుల దృష్టిలో నేటి అసాధారణమైన కార్యాలయాలను హైలైట్ చేస్తుందన్నారు. ఇక్కడ ఉద్యోగులు తమపై నమ్మకాన్ని ఉంచి, సాధికారత కల్పించారని భావిస్తూ తమ అత్యుత్తమ పనితీరును కనబరుస్తారని ఆమె పేర్కొన్నారు.

# 32 కార్లతో పేలుళ్లకు కుట్ర

**ఢిల్లీలో వరుస పేలుళ్లకు భారీ ప్రణాళిక**

**స్విస్ యాప్ 'థ్రీమా' ద్వారా చాటింగ్**

న్యూఢిల్లీ: ఢిల్లీ కారు పేలుడు కేసు దర్యాప్తులో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వస్తున్నాయి. అనుమానిత ఉగ్రవాదులు తమ ప్రణాళికలు, మ్యాపులు, ఇతర రహస్య సమాచారాన్ని పంచుకోవడానికి స్విట్జర్లాండ్‌కు చెందిన అత్యంత సురక్షితమైన 'థ్రీమా' అనే ఎన్‌క్రిప్టెడ్ యాప్‌ను ఉపయోగించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ యాప్‌ను ట్రేస్ చేయడం దాదాపు అసాధ్యం కావడంతో, ఇది దర్యాప్తు సంస్థలకు పెద్ద సవాల్‌గా మారింది. సోమవారం సాయంత్రం జరిగిన ఈ ఘటనలో 12 మంది అక్కడికక్కడే మరణించగా, తీవ్రంగా గాయపడిన మరొకరు గురువారం ఎల్ఎన్‌జేపీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఈ కుట్రలో కీలక సూత్రధారులుగా డాక్టర్ ఉమర్ ఉన్ నబీ, డాక్టర్ ముజమ్మిల్ గనాయ్, డాక్టర్ షాహీన్ షాహిద్ అనే ముగ్గురు వైద్యులను పోలీసులు అనుమానిస్తున్నారు. వీరంతా ఫరీదాబాద్‌లోని అల్ ఫలాహ్ యూనివర్సిటీకి చెందినవారే కావడం గమనార్హం. వీరిలో ఉమర్ అత్యంత తీవ్రవాద భావజాలం కలవాడని, పేలుడు జరిగిన కారును అతనే నడిపాడని దర్యాప్తులో తేలింది. సహచరులు పట్టుబడగానే ఉమర్ తన ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసి, డిజిటల్ ఆచూకీ దొరక్కుండా అజ్ఞాతంలోకి వెళ్లాడు. సాధారణంగా ఉగ్రవాదులు వాడే యాప్‌లకు భిన్నంగా, వీరు 'థ్రీమా' అనే స్విస్ యాప్‌ను వాడారు. దీనికి ఫోన్ నంబర్ గానీ, ఈమెయిల్ గానీ అవసరం లేదు. కేవలం ఒక యూనిక్ ఐడీతోనే చాటింగ్, వాయిస్ కాల్స్ చేసుకోవచ్చు. ఈ యాప్‌లో ఎండ్-టు-ఎండ్ ఎన్‌క్రిప్షన్ ఉండటంతో పాటు, మెసేజ్‌లు సర్వర్‌లో సేవ్ కావు. ఇరువైపులా డిలీట్ చేసుకునే సౌలభ్యం ఉండటంతో ఫోరెన్సిక్ రికవరీ కూడా దాదాపు అసాధ్యం. అనుమానితులు ఈ యాప్‌లోనే తమ ప్రైవేట్ సర్వర్‌ను ఏర్పాటు చేసుకుని మ్యాపులు, స్థానాలు, బాధ్యతల కేటాయింపు వంటివి చర్చించుకున్నారని పోలీసులు తెలిపారు. ఈ ముఠా కేవలం ఒక్క పేలుడుతో ఆగాలని అనుకోలేదు. ఢిల్లీలోని పలు చారిత్రక ప్రదేశాలు, కీలక ప్రభుత్వ కార్యాలయాల వద్ద వరుస పేలుళ్లు జరపాలని నిందితులు భారీ ప్రణాళిక రచించారు. ఇందుకోసం రాజధానిలో చాలాసార్లు రెక్కీ కూడా నిర్వహించారు. దర్యాప్తులో భాగంగా ఫరీదాబాద్‌లో ఓ రెడ్ ఎకోస్పోర్ట్ కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అమ్మోనియం నైట్రేట్‌ను కొద్దికొద్దిగా తరలించి, నిల్వ చేయడానికి ఈ కారును వాడినట్లు తేలింది. మొత్తం 32 కార్లను ఇలాంటి దాడులకు సిద్ధం చేస్తున్నారనే ప్రాథమిక సమాచారం పోలీసులను దిగ్భ్రాంతికి గురిచేసింది. 'ఉగ్రవాదుల మధ్య సమన్వయం, ప్రణాళికలో ఈ యాప్ కీలక పాత్ర పోషించింది' అని ఓ పోలీస్ అధికారి పేర్కొన్నారు.

# 17న షేక్ హసీనా కేసులపై తీర్పు

**బంగ్లాదేశ్‌లో మళ్లీ చెలరేగిన హింస**



ఢాకా: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాపై నమోదైన కేసు అంశంలో త్వరలో తీర్పు వెలువడనున్న నేపథ్యంలో ఆ దేశంలో మరోసారి హింస చెలరేగింది. దీంతో ఢాకాలో భద్రతను కట్టుదిట్టం చేశారు. మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడినట్టు ఆరోపణలతో షేక్ హసీనాపై కేసులు నమోదవడం తెలిసిందే. ఈ కేసుల విషయంలో నవంబర్ 17న తీర్పు వెలువడనుంది. ఈ తీర్పు రానున్న నేపథ్యంలో, పలుచోట్ల దాడులు జరుగుతున్నాయి. గతంలోని అనుభవాల దృష్ట్యా ఢాకాలో భద్రతను పెంచారు. ముఖ్యంగా తీర్పును వెలువరించే ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ చుట్టూ సెక్యూరిటీని కట్టుదిట్టం చేశారు. తీర్పు నేపథ్యంలో షేక్ హసీనా పార్టీ అవామీ లీగ్ ఢాకాలో లాక్‌డౌన్‌కు పిలుపునిచ్చింది. దీంతో నగరం సరిహద్దుల్లో భారీస్థాయిలో పోలీసులను మోహరించారు. రాజధాని నగరంలోకి ప్రవేశించే మార్గాల వద్ద పలు చెక్ పాయింట్లను ఏర్పాటు చేసి, ముమ్మర తనిఖీలు చేస్తున్నారు.


**ఫిబ్రవరిలో బంగ్లాదేశ్ ఎన్నికలు**

మరోవైపు, బంగ్లాదేశ్‌లో నెలకొన్న రాజకీయ అనిశ్చితికి తెరదించే ప్రయత్నంలో భాగంగా మధ్యంతర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. వచ్చే ఏడాది 2025 ఫిబ్రవరి ప్రథమార్ధంలో సాధారణ ఎన్నికలతో పాటే రిఫరెండం కూడా నిర్వహిస్తామని ప్రధాన పాలకుడు మహమ్మద్ యూనస్ గురువారం ప్రకటించారు. ఇస్లామిస్ట్ పార్టీల నుంచి తీవ్ర ఒత్తిడి వస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. 'సాధారణ ఎన్నికలతో పాటే రిఫరెండం నిర్వహించడం వల్ల సంస్కరణల లక్ష్యాలకు ఎలాంటి ఆటంకం ఉండదు. పైగా, ఇది ఎన్నికల ప్రక్రియను మరింత పండుగ వాతావరణంలో జరిపేందుకు, ఖర్చు తగ్గించేందుకు దోహదపడుతుంది' అని యూనస్ వివరించారు. రిఫరెండం నిర్వహణకు అవసరమైన చట్టాన్ని త్వరలోనే రూపొందిస్తామని, ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరిపేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన హామీ ఇచ్చారు. 'జూలై చార్టర్'లో ప్రతిపాదించిన రాజ్యాంగ సంస్కరణలపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనున్నట్లు తెలిపారు. అయితే, ఈ ప్రకటన వెనుక ఇస్లామిస్ట్ పార్టీల నుంచి తీవ్ర ఒత్తిడి ఉన్నట్లు స్పష్టమవుతోంది. 'జూలై చార్టర్'కు చట్టబద్ధమైన గుర్తింపు ఇవ్వకుండా ఎన్నికలు జరపడానికి వీల్లేదని ఎనిమిది ఇస్లామిస్ట్ పార్టీలు మంగళవారమే ప్రభుత్వాన్ని హెచ్చరించాయి. ఎన్నికలకు ముందే రిఫరెండం నిర్వహించాలనే తమ డిమాండ్‌ను పునరుద్ఘాటించాయి. జమాత్-ఎ-ఇస్లామీ, ఇస్లామీ ఆందోళన్ వంటి పార్టీలు ఇందులో ఉన్నాయి. ఢాకాలోని పల్టన్ కూడలిలో జరిగిన ఓ ర్యాలీలో ఈ పార్టీల నేతలు మాట్లాడుతూ.. తమ డిమాండ్లను పరిష్కరించకపోతే మహమ్మద్ యూనస్ అధికారిక నివాసాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. "జూలై తిరుగుబాటుకు గుర్తింపు ఇవ్వకుండా ఎన్నికలు జరగవు. ఎన్నికలు జరగాలంటే ముందు చట్టబద్ధత కల్పించాలి. లేకపోతే ఆ ఎన్నికలు చట్టవిరుద్ధం అవుతాయి" అని జమాత్ నేత షఫీకుర్ రెహమాన్, ఇస్లామీ ఆందోళన్ నేత సయ్యద్ ముహమ్మద్ రెజాల్ కరీం స్పష్టం చేశారు.

# అల్లా సాయంతో యుద్ధం చేస్తాం

**భారత్, అఫ్ఘనిస్థాన్‌పై విరుచుకుపడతాం**

**పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్**



ఇస్లామాబాద్: ఎర్రకోట ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తమ దేశం రెండు దేశాలతో యుద్ధానికి సిద్ధంగా ఉందని ప్రకటించారు. తూర్పు సరిహద్దులో భారత్, పశ్చిమ సరిహద్దులో తాలిబన్లతో రెండు వైపులా యుద్ధానికి తాము సంసిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఆయన భారత్‌ను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేశారు. 'మేము రెండు వైపులా యుద్ధానికి సిద్ధంగా ఉన్నాము. తూర్పు (భారతదేశం), పశ్చిమ సరిహద్దు (ఆఫ్ఘనిస్థాన్) దేశాలను రెండింటినీ ఎదుర్కోవడానికి మేము పూర్తి సన్నద్ధతతో ఉన్నాం. ఈ యుద్ధంలో అల్లా మాకు అన్ని విధాలుగా సాయం చేస్తాడు' అని పేర్కొన్నారు. కాగా పాకిస్థాన్‌లో రెండు రోజుల క్రితం ఆత్మాహుతి దాడి ఘటన చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఇస్లామాబాద్‌లోని ఒక కోర్టు ఆవరణలో కారులో బాంబు పేలింది. ఈ ఘటనలో 12 మంది మరణించగా 36 మంది గాయపడ్డారు. ఈ ఆత్మాహుతి బాంబు దాడికి తెహ్రీక్-ఇ-తాలిబన్ పాకిస్థాన్ బాధ్యత వహించింది. అయితే, ఈ దాడి విషయంలో పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ భారత్‌ను దోషిగా చూపే ప్రయత్నం చేశారు.

# పొగకు మాస్కులేం సరిపోతాయ్?

**ఢిల్లీలో వాయు కాలుష్యంపై సుప్రీం ఆందోళన**



న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయిలో ఉంది. రాజధాని ప్రాంతంలో గాలి నాణ్యత రోజురోజుకూ క్షీణిస్తోంది. గత కొన్ని రోజులుగా గాలి నాణ్యత సూచిక 400కిపైనే నమోదవుతోంది. దీంతో రాజధాని వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలు అనారోగ్య సమస్య లకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో ఢిల్లీలో వాయు కాలుష్యం తీవ్రతపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఢిల్లీలో వాయు కాలుష్య పరిస్థితిని చాలా తీవ్రమైనదిగా అభివర్ణించింది. వాయు కాలుష్య తీవ్రతకు మాస్కులు కూడా సరిపోవని వ్యాఖ్యానించింది. ఈ మేరకు సీనియర్ న్యాయవాదులను వర్చువల్‌గా విచారణకు హాజరుకావాలని సూచించింది. వర్చువల్‌గా హాజరయ్యే వెసులుబాటు ఉన్నప్పటికీ మీరు ఎందుకు భౌతికంగా కోర్టు కార్యకలాపాలకు హాజరువు తున్నారని సీనియర్ న్యాయవాదులను జస్టిస్ పీఎస్ నరసింహ ప్రశ్నించారు. 'మీకు వర్చువల్‌గా విచారణకు హాజరయ్యే సౌకర్యం ఉంది. అయినా ఎందుకు వస్తున్నారు..? దాన్ని సద్వినియోగం చేసుకోండి. కాలుష్యం తీవ్ర నష్టాన్ని కలిగిస్తుంది' అని అన్నారు.

# చచ్చినా బతికే ఉన్న 6 కోట్ల మంది!

న్యూఢిల్లీ: దేశంలో మరణించిన వారి ఆధార్ కార్డులు కోట్ల సంఖ్యలో క్రియాత్మకంగా ఉండటం పట్ల ప్రభుత్వం ఆందోళన చెందుతున్నది. భారత్‌లో 2009 జనవరిలో ఆధార్ కార్డుల విధానాన్ని ప్రవేశపెట్టారు. అయి తే అప్పటి నుంచి 8 కోట్ల మంది పౌరులు మరణించగా, వారిలో 1.83 కోట్ల కార్డులు మాత్రమే క్రియారహితం అయ్యాయి. అంటే మరణించిన ఆరు కోట్ల మంది భారతీయుల ఆధార్ కార్డులు యాక్టివ్‌గానే ఉన్నాయి. ఇది బ్యాంక్‌ల మోసం, తప్పుడు అకౌంట్లు, ప్రభుత్వ సంక్షేమ పథకాల దుర్వినియోగం దారి తీయవచ్చునని ప్రభుత్వం ఆందోళన చెం దుతున్నది.




# అవతార్ 3కి 3.15 గంటల రన్‌టైమ్

**డిసెంబర్ 19న ప్రపంచవ్యాప్తంగా విడుదల**

న్యూయార్క్: హాలీవుడ్ దర్శకుడు జేమ్స్ కామెరూన్ సృష్టిస్తున్న దృశ్య కావ్యం 'అవతార్3' ఏకంగా 3 గంటల 15 నిమిషాల (195 నిమిషాలు) నిడివితో రానుండటం విశేషం. దీంతో 'అవతార్' సిరీస్‌లోనే ఇది అత్యంత అధిక నిడివి గల చిత్రంగా రికార్డు సృష్టించనుంది. గతంలో వచ్చిన 'అవతార్' (2009) మొదటి భాగం 2 గంటల 58 నిమిషాలు ఉండగా, రెండో భాగం 'అవతార్: ది వే ఆఫ్ వాటర్' 3 గంటల 12 నిమిషాల నిడివితో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇప్పుడు మూడో భాగం అంతకుమించిన నిడివితో రాబోతోంది. ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా 2025 డిసెంబర్ 19న విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పండోరా గ్రహం నేపథ్యంలో సాగే ఈ కథలో ఈసారి ఓ కొత్త విలన్‌ను పరిచయం చేయబోతున్నారు. 'వరాంగ్' అనే ఈ పాత్రలో నటి ఊనా చాప్లిన్ కనిపించనుంది. పండోరా జీవధార అయిన ఐవాను వ్యతిరేకించే తొలి నావి పాత్ర ఇదే కావడం కథలో కీలక మలుపు కానుంది. ఈ సినిమా గురించి దర్శకుడు జేమ్స్ కామెరూన్ మాట్లాడుతూ.. "గత భాగాలతో పోలిస్తే ఇది మరింత ఉత్కంఠభరితంగా, భావోద్వేగభరితంగా, భారీ స్థాయిలో ఉంటుంది" అని తెలిపారు. సామ్ వర్తింగ్టన్, జోయ్ సల్డానా, సిగోర్నీ వీవర్, కేట్ విన్‌స్లెట్ వంటి పాత తారాగణంతో పాటు కొత్తగా ఊనా చాప్లిన్ కూడా ఈ చిత్రంలో భాగమయ్యారు.

# ఎట్టకేలకు ముగిసిన షట్‌డౌన్

## 42 రోజుల తర్వాత సాధారణ కార్యకలాపాలు.. తాత్కాలిక నిధుల బిల్లుపై ట్రంప్ సంతకం

వాషింగ్టన్: అమెరికా రాజకీయాల్లో 42 రోజులుగా కొనసాగుతున్న ప్రతిష్టంభనకు తెరపడింది. దేశ చరిత్రలోనే సుదీర్ఘంగా సాగిన ప్రభుత్వ షట్‌డౌన్ ఎట్టకేలకు ముగిసింది. ఫెడరల్ కార్యకలాపాలకు తాత్కాలికంగా నిధులు కేటాయించే బిల్లుపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం చేశారు. డెమొక్రాట్లు పట్టుబట్టిన ఒబామాకేర్ సబ్సిడీల డిమాండ్‌ను అంగీకరించకుండానే ఈ బిల్లు ఆమోదం పొందడం రిపబ్లికన్లకు రాజకీయ విజయంగా రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. బుధవారం సెనేట్ ఆమోదించిన ఈ బిల్లును ప్రతినిధుల సభ కూడా ఆమోదించడంతో ప్రతిష్టంభన వీడింది. సెనేట్‌లో బిల్లు ముందుకు కదలాలంటే 60 ఓట్లు అవసరం కాగా, మెజారిటీ రిపబ్లికన్లకు ఆ సంఖ్యాబలం లేదు. అయితే, 8 మంది డెమొక్రాట్లు పార్టీ వైఖరికి వ్యతిరేకంగా రిపబ్లికన్లతో కలిసి ఓటు వేయడంతో బిల్లు పాసయ్యేందుకు మార్గం సుగమమైంది. ప్రతినిధుల సభలో ఈ బిల్లుకు 222-209 ఓట్ల తేడాతో ఆమోదం లభించింది. ఈ నిర్ణయంతో విమాన ప్రయాణాలు, పేదలకు ఆహార సబ్సిడీ కార్యక్రమాలు సహా నిలిచిపోయిన అన్ని ఫెడరల్ సేవలు తిరిగి ప్రారంభం కానున్నాయి. అయితే, అన్ని కార్యకలాపాలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రావడానికి కొంత సమయం పట్టవచ్చు. షట్‌డౌన్



సమయంలో పని చేయని, వేతనం లేకుండా పనిచేసిన ఫెడరల్ ఉద్యోగులందరికీ వారి బకాయి జీతాలు అందనున్నాయి. బిల్లుపై సంతకం చేసిన అనంతరం ట్రంప్ మాట్లాడుతూ.. ఇది ఒక గొప్ప రోజు అని వ్యాఖ్యానించారు. వచ్చే ఏడాది జరిగే కాంగ్రెస్ ఎన్నికల్లో ఈ షట్‌డౌన్‌ను ప్రజలు మర్చిపోవద్దని ఆయన సూచించారు. అయితే, డెమొక్రాట్లు కూడా దీటుగా స్పందించారు. ప్రతినిధుల సభలో డెమొక్రాటిక్ నేత హకీమ్ జెఫ్రీస్ మాట్లాడుతూ, "ఈ ఏడాదైనా రిపబ్లికన్లు ఒబామాకేర్ ట్యాక్స్ క్రెడిట్లను పొడిగించాలి. లేదంటే వచ్చే ఏడాది ఎన్నికల్లో అమెరికా ప్రజలు వారిని ఉద్యోగాల నుంచి తొలగిస్తారు" అని హెచ్చరించారు. షట్‌డౌన్‌ను ముగించేందుకు కొందరు డెమొక్రాట్లు సొంత పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేయడం పార్టీలో చీలికకు దారితీసింది. రిపబ్లికన్లతో కలిసిన డెమొక్రాట్ కాంగ్రెస్ సభ్యురాలు మేరీ గ్లూసెన్‌క్యాంప్ పెరెజ్ మాట్లాడుతూ, "ఆహార సహాయంపై ఆధారపడిన నా స్నేహితులు ఎవరూ వాషింగ్టన్ డీసీలో రాజకీయ సందేశ విజయం కోసం తమ రాత్రి భోజనాన్ని వదులుకోవాలనుకోరు" అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు డెమొక్రాట్లపై ఉన్న ఒత్తిడిని స్పష్టం చేస్తున్నాయి. తాజా చట్టం ప్రకారం చాలా ప్రభుత్వ కార్యకలాపాలకు ఈ ఏడాది చివరి వరకు నిధులు అందుతాయి. సైనిక సిబ్బందికి పదవీ విరమణ సేవలు, పేదలకు ఆహార కార్యక్రమాలు వంటి కొన్ని పథకాలకు సెప్టెంబర్ వరకు నిధులు కొనసాగుతాయి. ఇదిలా ఉండగా, ఈ బిల్లులో సెనేటర్ల ఫోన్ రికార్డులకు సంబంధించిన ఒక అసాధారణ నిబంధనను రహస్యంగా చేర్చారు. దీని ప్రకారం ఫెడరల్ ప్రాసిక్యూటర్లు సెనేటర్లకు ముందస్తు నోటీసు ఇవ్వకుండా వారి ఫోన్ రికార్డులను శోధించడం చట్టవిరుద్ధం. ఈ నిబంధన 2022 నుంచి వర్తిస్తుంది.

లగ్జరి చిత్రం


రాశీ ఖన్నా



## తలైవర్ 173 నుంచి డైరెక్టర్ ఔట్

సినిమా అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'తలైవర్ 173' ప్రాజెక్ట్ గురించి అందరికీ తెలిసిందే. సూపర్ స్టార్ రజినీకాంత్ హీరోగా, లోకనాయకుడు కమల్ హాసన్ నిర్మాతగా ఈ సినిమాను ప్రకటించిన క్షణం నుంచి అంచనాలు హై రేంజ్ కు వెళ్లాయి. ఈ మెగా ప్రాజెక్ట్ సెట్స్‌పైకి వెళ్లేందుకు సిద్ధమవుతున్న తరుణంలో, సినిమా యూనిట్ నుంచి ఒక సడన్ అప్‌డేట్ వచ్చింది. ఈ ప్రాజెక్ట్ నుంచి ఒక కీలక వ్యక్తి తప్పుకున్నట్లు వచ్చిన వార్త సోషల్ మీడియాను కుదిపేస్తోంది. సినిమాకు కెప్టెన్‌గా ఉండాల్సిన వ్యక్తే తప్పుకోవడంతో, ఇప్పుడు ఈ సినిమా భవిష్యత్తు ఏంటి, అసలు ఎందుకిలా జరిగిందనే చర్చ మొదలైంది. డైరెక్టర్ సుందర్ సి. స్వయంగా ఒక ఎమోషనల్ లెటర్ రిలీజ్ చేశారు. "కొన్ని అనుకోని పరిస్థితుల కారణంగా" తాను 'తలైవర్ 173' లాంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ నుంచి తప్పుకుంటున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ నిర్ణయం తీసుకోవడం తన హృదయానికి చాలా భారంగా ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రజినీకాంత్, కమల్ హాసన్ లాంటి ఇద్దరు లెజెండ్స్‌తో పనిచేయడం తన కల అని, ఆ అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని సుందర్ సి. తెలిపారు. వాళ్లతో గడిపిన కొద్ది రోజులైనా తనకు ఎన్నో మధుర జ్ఞాపకాలను ఇచ్చాయని, వారి నుంచి ఎంతో నేర్చుకున్నానని లెటర్‌లో పేర్కొన్నారు.



## ఇష్టమొచ్చినట్లు వస్తే నో ఎంట్రీ: రాజమౌళి


మహేశ్ బాబు, రాజమౌళి ఎస్ఎస్ఎంబీ29 సినిమా కోసం 'గ్లోబ్ ట్రాటర్' ఈవెంట్‌ను చిత్ర బృందం ప్లాన్ చేస్తోంది. ఈ నెల 15న రామోజీ ఫిల్మ్ సిటీలో జరగబోయే ఈ ఈవెంట్ కోసం సోషల్ మీడియా మొత్తం దద్దరిల్లిపోతోంది. కానీ, సరిగ్గా ఈ టైమ్‌లో డైరెక్టర్ రాజమౌళి స్వయంగా ఒక వీడియో రిలీజ్ చేసి, కొన్ని రూల్స్ చెప్పారు. ముఖ్యంగా, ఫ్యాన్స్ చేసే చిన్న పొరపాటు వల్ల ఈవెంట్ మొత్తం క్యాన్సిల్ అయ్యే ప్రమాదం ఉందని గట్టిగా వార్నింగ్ ఇచ్చారు. 'ఇది ఓపెన్ ఈవెంట్ కాదు. దయచేసి ఎవరూ పాస్ లేకుండా రావద్దు. సోషల్ మీడియాలో కొందరు ఇది ఓపెన్ ఈవెంట్, ఎవరైనా రావచ్చు అని, చెప్తున్నారు. అలా వచ్చే ఫేక్ న్యూస్‌ను అస్సలు నమ్మకండి కేవలం 'ఫిజికల్ పాస్' చేతిలో ఉన్న వాళ్లను మాత్రమే లోపలికి అనుమతిస్తాం, ఈవెంట్‌కు వస్తున్న ప్రతీ ఒక్కరూ తమ పాస్‌ను వెంట తెచ్చుకోవడం తప్పనిసరి' అని అన్నారు. ఈ ఈవెంట్‌కు కొన్ని కఠినమైన వయోపరిమితులు కూడా పెట్టారు. 18 సంవత్సరాలలోపు పిల్లలకు, అలాగే సీనియర్ సిటిజన్లకు (పెద్ద వయసు వారికి) పోలీస్ శాఖ అనుమతి నిరాకరించిందని, వాళ్లందరూ తమ భద్రత దృష్ట్యా ఇంట్లోనే ఉండాలని, ఈవెంట్‌ను జియో హాట్‌స్టార్‌లో లైవ్ చూడాలని కోరారు.



## శ్రీలీలకు డబుల్ బొనాంజా

సుధా కొంగర దర్శకత్వంలో శివకార్తికేయన్, శ్రీలీల జంటగా నటిస్తున్న పీరియాడికల్ డ్రామా 'పరాశక్తి'. ఈ మూవీ వచ్చే ఏడాది సంక్రాంతి స్పెషల్‌గా జనవరి 14న రిలీజ్ కానుంది. ఇప్పటికే ఈ చిత్రం నుంచి వచ్చిన అప్డేట్స్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.. ప్రమోషనల్ కంటెంట్‌తో మరింతగా సినిమాపై చిత్ర బృందం పాజిటివ్ ఇంపాక్ట్ క్రియేట్ చేస్తోంది. అయితే, ఈ సినిమా విడుదల కాకముందే.. శివకార్తికేయన్, శ్రీలీల మరోసారి జత కట్టేందుకు సిద్ధం అయినట్లు సమాచారం. శివకార్తికేయన్ దర్శకుడు సిబి చక్రవర్తితో శ్రీలీల చేతులు కలపబోతున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్ షూటింగ్ డిసెంబర్ 10న చెన్నై శివారు ప్రాంతాల్లో ప్రారంభమవుతుంది. ఇప్పటికే ప్రీ-ప్రొడక్షన్ పనులు కూడా జోరుగా జరుగుతున్నాయని సమాచారం. ఈ సినిమాలో ముందుగా రష్మిక మందన్నను హీరోయిన్‌గా ఫిక్స్ చేశారు. డేట్స్ కారణంగా రష్మిక తప్పుకోవడంతో, శ్రీలీలను ఫైనల్ చేశారట మేకర్స్. ఇప్పటికే టీమ్‌లో శ్రీలీల జాయిన్ కాగా.. డిసెంబర్ చివర్లో షెడ్యూల్ తర్వాత.. తదుపరి షెడ్యూల్ 2026 పొంగల్ తర్వాత ప్రారంభం కానుందట. ప్రజెంట్ ఇందుకు సంబంధించిన వార్తలు వైరల్ అవుతుండగా.. ఒకేసారి రెండు సినిమాలు చేయడం విశేషంగా మారింది.






## గ్లోబ్ ట్రోటర్‌కు అప్పుడే 20 కోట్లు

రాజమౌళి మహేష్ బాబుతో ఎస్ఎస్ఎమ్‌బీ29 అనే వర్కింగ్ టైటిల్ తో సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా 2027లో ప్రేక్షకుల ముందుకు రానుంది. అభిమానుల కోసం గ్లోబ్ ట్రోటర్ అంటూ ఈవెంట్‌ను నిర్వహిస్తున్నారు. ఈ ఈవెంట్ స్ట్రీమింగ్ హక్కులను జియో హాట్ స్టార్‌కి అమ్మేసినట్లు తెలుస్తోంది. ఈవెంట్ కోసం 30 కోట్ల మేర ఖర్చు కాగా, ఈవెంట్ హక్కులను రాజమౌళి జియో హాట్ స్టార్‌కు 50 కోట్లకు అమ్మివేసినట్లు సమాచారం. దీన్ని బట్టి చూస్తే ఈవెంట్‌ని కూడా అమ్మేసి ఏకంగా 20 కోట్లు లాభాన్ని దక్కించుకున్నట్లు తెలిసింది. ఇకపోతే ఈవెంట్ వేదికగా ఎస్ఎస్ఎంబి 29కి సంబంధించిన గ్లింప్స్ తో పాటు మహేష్ బాబు ఫస్ట్ లుక్ పోస్టర్ ని కూడా రిలీజ్ చేయబోతున్నారు . ఇప్పటికే ఈ సినిమాలో హీరోయిన్గా నటిస్తున్న గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు.



## చెమటోడుస్తున్న కాయదు లోహార్

కన్నడ హీరోయిన్‌గా పరిచయం అయిన కాయదు లోహార్.. మలయాళం, తెలుగు సినిమాల్లోనూ నటించింది. తెలుగులో ఈమె చేసిన అల్లూరి సినిమా పెద్దగా గుర్తింపు తెచ్చి పెట్టలేదు. దాంతో కయాదు లోహర్ కెరీర్ పరంగా మళ్లీ పుంజుకోవడం కష్టమే అని ఆమె సన్నిహితులే అనుకున్నారు. కానీ అనూహ్యంగా ఈ ఏడాదిలో ఆమె నటించిన డ్రాగన్ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చి ఒక్కసారిగా పరిస్థితులను మార్చేసింది. తమిళ్, తెలుగులో ఆమె బిజీ అయ్యే విధంగా డ్రాగన్ మూవీ హిట్ అయింది. ప్రస్తుతం ఈ అమ్మడు చేతిలో ఏకంగా 6 సినిమాలు ఉన్నాయి. అందులో ఒక తెలుగు సినిమా కూడా ఉంది. రాబోయే రోజుల్లో కాయదు మోస్ట్ వాంటెడ్, పాపులర్ హీరోయిన్‌గా నిలవడం ఖాయం అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. అయితే.. ఇటీవల ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఈ బ్యూటీ షేర్ చేసిన వీడియో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ట్రైనర్ సమక్షంలో బాక్సింగ్ ట్రైనింగ్ అవుతోంది. ఫిజిక్‌ను మరింత నాజూగ్గా మార్చుకొనేందుకే బాక్సింగ్ ప్రాక్టీస్ చేస్తోందని తెలుస్తోంది.

## శ్రీదేవి కూతురు సిగ్గు విడిచేసిందిగా..!

జాన్వీ కపూర్ గత కొంతకాలంగా రిలేషన్ లో ఉన్నట్లు వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. శిఖర్ పహారియా అనే ఒక వ్యాపారవేత్తతో ప్రేమ వ్యవహారం సాగుతున్నట్లు చాలా కథనాలు వినిపించాయి. మరోవైపు శిఖర్ పహారియాకి మంచి పొలిటికల్ బ్యాక్ గ్రౌండ్ కూడా ఉంది. కేంద్ర మాజీ హెూం మంత్రి సుశీల్ కుమార్ సిండే మనవడు కావడం విశేషం. శిఖర్ పహారియా సోదరుడు వీర్ పహారియా సినిమా రంగంలో నటుడుగా చేస్తున్నాడు. శిఖర్ మాత్రం సినిమాలకు దూరంగా ఉంటూ బిజినెస్ పనులు చూసుకుంటాడు. గతంలో జాన్వీ కపూర్ తో శిఖర్ ఫోటోలు బాగా వైరల్ అయ్యాయి. అయితే వీళ్ళిద్దరి మధ్య మంచి బాండింగ్ ఉంది అని అందరికీ ఒక సందేహం ఉండేది. ఈ సందేహాలు అన్నిటికీ కూడా జాన్వికపూర్ మరోసారి కన్ఫామ్ చేసినట్లు అనిపిస్తోంది. బోనికపూర్ బర్త్డే సెలబ్రేషన్స్ వేడుకల్లో ఆ ఫ్యామిలీకి చెందిన వారంతా పాల్గొన్నారు. అయితే వాళ్లలో శిఖర్ పహారియా కూడా ఉండటం ఆశ్చర్యం కలిగిస్తుంది. గెస్ట్ లా కాకుండా ఒక కుటుంబ సభ్యుడి లాగా ఆ ఈవెంట్లో తెలిసి పోయాడు. ఆ ఫోటోలు బట్టి చూస్తే జాన్వీ కపూర్ కన్ఫామ్ చేసింది అని అందరూ అనుకుంటున్నారు. ప్రస్తుతం జాన్వి కపూర్ రామ్ చరణ్ తేజ్ నటిస్తున్న పెద్ది సినిమాలో హీరోయిన్ గా నటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా మీద కూడా విపరీతమైన అంచనాలు ఉన్నాయి.

# ఇక సఫారీలతో కుస్తీ

## నేటి నుంచే టెస్ట్ సిరీస్ ప్రారంభం
## కోల్‌కతా వేదికగా తొలి టెస్టు

**టీమిండియా – దక్షిణాఫ్రికా మధ్య శుక్రవారం నుంచి టెస్ట్ సిరీస్ ప్రారంభం కానుంది. మొన్నటి వరకు ఆస్ట్రేలియా గడ్డపై టి20 లు ఆడిన టీమిండియా, ఇప్పుడు ఫార్మాట్ మార్చబోతోంది. టీమిండియా వర్సెస్ దక్షిణాఫ్రికా మధ్య రెండు టెస్టులు జరగనున్నాయి. ఈ మేరకు ఇప్పటికే షెడ్యూల్ కూడా ఖరారైంది. స్వదేశంలోనే ఈ సిరీస్ నిర్వహించనున్నారు. ఉదయం 9:30 గంటలకు మ్యాచ్ ప్రారంభమవుతుంది. టెస్ట్ సిరీస్‌ను జియో హాట్ స్టార్ ప్రసారం చేస్తోంది.**

టీమిండియా – దక్షిణాఫ్రికా మధ్య టెస్ట్ సిరీస్‌ల రికార్డును పరిశీలిస్తే, ఇందులో సఫారీలు పై చేయి సాధించినట్లు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. ఇప్పటి వరకు ఈ రెండు జట్ల మధ్య 44 టెస్టు మ్యాచ్ లు జరిగాయి. ఇందులో టీమిండియా కేవలం 16 మ్యాచ్ లు మాత్రమే విజయం సాధించింది. అటు దక్షిణాఫ్రికా ఏకంగా 18 మ్యాచ్ లు విక్టరీ సాధించి లీడ్ లో ఉంది. ఇక హెూమ్ టౌన్ లో దక్షిణాఫ్రికా పై 11 మ్యాచ్ లలో టీమిండియా విజయం సాధించింది. అంటే విదేశాల్లో కేవలం ఐదు మ్యాచ్ లలో టీమిండియా గెలవడం గమనార్హం. దక్షిణాఫ్రికాతో టెస్ట్ సిరీస్ జరుగనున్న నేపథ్యంలో నితీష్ కుమార్ రెడ్డి ఆడటం లేదని బీసీసీఐ ఇప్పటికే ప్రకటించింది. దీంతో రేపటి మ్యాచ్ లో రిషబ్ పంత్, జురేల్ ఆడే ఛాన్సులు కనిపిస్తున్నాయి.

### జట్లు అంచనా:

**ఇండియా:** కేఎల్ రాహుల్, యశస్వి జైస్వాల్, సాయి సుదర్శన్, శుభమన్ గిల్ (కెప్టెన్), రిషబ్ పంత్ (వికెట్ కీపర్, వైస్ కెప్టెన్), రవీంద్ర జడేజా, ధ్రువ్ జురెల్, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్.

**దక్షిణాఫ్రికా:** ఐడెన్ మార్క్రామ్, ర్యాన్ రికెల్టన్, ట్రిస్టన్ స్టబ్స్, టోనీ డి జోర్జి, టెంబా బావుమా (కెప్టెన్), కైల్ వెర్రెయిన్ (వికెట్ కీపర్), సెనురన్ ముత్తుసామి, కార్బిన్ బాష్, సైమన్ హార్మర్, కేశవ్ మహరాజ్, కగిసో రబాడ.



## యువ పేసర్ల వల్లే షమీకి ఇబ్బందులు: గిల్



మహ్మద్ షమీకి జట్టులో చోటులేకపోవడంపై దక్షిణాఫ్రికాతో టెస్ట్ సిరీస్‌కు ముందు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ స్పందించాడు. మహ్మద్ షమీ సామర్థ్యాన్ని జట్టు యాజమాన్యం గౌరవిస్తున్నప్పటికీ.. యువ పేసర్ల ఇటీవల ప్రదర్శనను విస్మరించలేమని గిల్ స్పష్టం చేశాడు.'షమీ భాయ్ లాంటి బౌలర్లు చాలా అరుదుగా ఉంటారు. కానీ మేము ప్రస్తుతం జట్టులో ఉన్న ఆకాష్ దీప్, ప్రసిద్ధ్ కృష్ణ, బుమ్రా, సిరాజ్ వంటి ఆటగాళ్ల ఇటీవల అద్భుత ప్రదర్శనను విస్మరించలేం' అని అన్నాడు. ఈ కామెంట్స్‌తో జట్టు యాజమాన్యం షమీ స్థానంలో యువ పేసర్లు ఆకాష్ దీప్, ప్రసిద్ధ్ కృష్ణపై పూర్తి విశ్వాసం ఉంచిందని స్పష్టమవుతోంది. షమీ ఎంపిక గురించి తుది నిర్ణయం సెలెక్టర్లదే అని చెబుతూనే, గిల్ తన నలుగురు పేసర్ల బృందంపై పూర్తి నమ్మకాన్ని ప్రదర్శించాడు.

## కెప్టెన్సీ ఇస్తేనే రాజస్థాన్‌కు!: జడేజా



ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్ రిటెన్షన్ గడువు దగ్గర పడుతున్న తరుణంలో క్రికెట్ ప్రపంచంలో ఊహించని భారీ ట్రేడింగ్‌కు రంగం సిద్ధమవుతోంది. ముఖ్యంగా చెన్నై సూపర్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్ జట్ల మధ్య జరగబోయే మార్పిడి ఒప్పందంపై క్రీడావర్గాల్లో భారీ చర్చ జరుగుతోంది. ఈ కీలక ఒప్పందంలో భాగంగా రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ సంజూ శాంసన్‌ను చెన్నై సూపర్ కింగ్స్‌కు పంపనుంది. అందుకు బదులుగా సీఎస్కే నుంచి స్టార్ ఆల్‌రౌండర్లు రవీంద్ర జడేజా, శామ్ కరన్‌లను రాజస్థాన్ రాయల్స్ తమ జట్టులోకి తీసుకోనుంది. క్రీడా వర్గాల ప్రకారం.. ఈ మూడు-మార్గాల ట్రేడింగ్ దాదాపుగా ఖరారైనట్లే. అయితే రాజస్థాన్ రాయల్స్‌కు తిరిగి వెళ్లేందుకు టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా ఓ షరతు పెట్టినట్లు సమాచారం. రాజస్థాన్ రాయల్స్ జట్టు యాజమాన్యం కెప్టెన్సీ బాధ్యతలను తనకు అప్పగిస్తేనే ఈ ట్రేడింగ్ ఒప్పందానికి అంగీకరిస్తానని వెల్లడించినట్లు తెలిసనింది. ఈ షరతుతో రాజస్థాన్ యాజమాన్యం తీవ్రంగా ఆలోచిస్తున్నట్లు సమాచారం. ఈ డీల్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన మరో రెండు, మూడు రోజుల్లో వెలువడే అవకాశం ఉందని క్రీడా విశ్లేషకులు పేర్కొంటున్నారు.

## న్యూయార్క్ వీధుల్లో కావ్యమారన్, అనిరుధ్



ప్రముఖ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచంద్రన్ , ఐపీఎల్ జట్టు సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓనర్ కావ్యమారన్ మధ్య ప్రేమాయణం సాగుతోందంటూ వస్తున్న పుకార్లు ఇప్పుడు మరింత బలం పుంజుకున్నాయి. తాజాగా వీరిద్దరు అమెరికాలోని న్యూయార్క్ వీధుల్లో కలిసి కనిపించడంతో వచ్చే ఏడాదిలోనే పెళ్లి చేసుకోబోతున్నారనే ఊహాగానాలు కోలీవుడ్ వర్గాల్లో ఊపందుకున్నాయి. ఒక అమెరికన్ యూట్యూబర్ న్యూయార్క్ వీధుల్లో వీడియో చిత్రీకరిస్తుండగా.. అనిరుధ్, కావ్యమారన్ కెమెరాకు చిక్కారు. ఇద్దరూ కలిసి నవ్వుతూ మాట్లాడుకుంటూ నడుచుకుంటూ వెళు_న్న దృశ్యాలు ఆ వీడియోలో రికార్డయ్యాయి. ఈ వీడియో కాస్తా సోషల్ మీడియాలో పోస్ట్ చేయగానే వైరల్‌గా మారింది. వచ్చే ఏడాదే వీరి పెళ్లి జరగబోతోందని.. ఈ విషయంలో ఇరు కుటుంబాల పెద్దల అంగీకారం కూడా ఉందని కోలీవుడ్ మీడియా వర్గాలు జోరుగా ప్రచారం చేస్తున్నాయి. అయితే గతంలో ఈ వార్తలు వచ్చినప్పుడు అనిరుధ్ టీమ్ త్వరగా స్పందించింది. 'వారిద్దరూ కేవలం మంచి స్నేహితులు మాత్రమే, వారి మధ్య ప్రేమ వంటిదేమీ లేదు' అని ఆ వార్తలను ఖండించింది.

## 'ముంబై' చేరిన శార్దూల్



**ఐపీఎల్ 19వ సీజన్ వేలానికి ముందే స్టార్ ఆల్‌రౌండర్‌ను ముంబై ఇండియన్స్ కొనేసింది. రీటెన్షన్ గడువు సమీపిస్తున్న వేళ బిగ్ ప్లేయర్ అయిన శార్దూల్ ఠాకూర్‌ను చేజిక్కించుకుంది. పరస్పర బదలాయింపు విధానంలో లేదా ట్రేడ్ డీల్ ద్వారా లక్నో సూపర్ జెయింట్స్ నుంచి శార్దూల్‌ను తీసుకునేందుకు ఇరు ఫ్రాంచైజీల మధ్య చర్చలు జరిగాయి. చివరకు రూ.2 కోట్లకు తమ గూటికి చేర్చుకుంది.**

దాంతో.. ట్రేడ్ పద్ధతిన పేస్ అల్‌రౌండర్ అర్జున్ టెండూల్కర్‌ను ముంబై వదులుకోనుందనే వార్తలకు చెక్ పడింది. శార్దూల్‌ను కొన్న విషయాన్ని ముంబై ఎక్స్ వేదికగా వెల్లడించింది. కలల సిటీ అయిన ముంబై, మా ఇల్లుకు స్వాగతం అని పోస్ట్ పెట్టింది ముంబై. ఐపీఎల్‌లో మరో ప్లేయర్‌కులేని రికార్డు శార్దూల్ ఠాకూర్‌కు ఉంది. ఈ పేస్ ఆల్‌రౌండర్ ఇప్పటివరకూ మూడు సార్లు వేలానికి వెళ్లకుండానే అమ్ముడయ్యాడు. 2017లో కింగ్స్ లెవన్ పంజాబ్ నుంచి అతడిని రైజింగ్ పుణె సూపర్ జెయింట్స్ తీసుకుంది. 2023లో ఢిల్లీ క్యాపిటల్స్ వద్దనుకోవడంతో శార్దూల్‌ను కోల్‌కతా నైట్ రైడర్స్ సొంతం చేసుకుంది. ఇప్పుడు లక్నో నుంచి రూ.2 కోట్లకు ముంబై అతడిని కొనుగోలు చేసింది. ముంబై ప్రధాన పేసర్ దీపక్ చాహర్ గాయపడిన విషయం తెలిసిందే. అతడి స్థానాన్ని శార్దూల్ భర్తీ చేయనున్నాడు.

### రూథర్‌ఫోర్డ్ కూడా..

శార్దూల్ ఠాకూర్ ట్రేడింగ్‌ను ధ్రువీకరించిన కొద్ది నిమిషాలకే ముంబై ఇండియన్స్ తమ రెండో డీల్‌ను ప్రకటించింది. వెస్టిండీస్ స్టార్ ఆల్‌రౌండర్ షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్‌ను గుజరాత్ టైటాన్స్ నుంచి ట్రేడ్ ద్వారా దక్కించుకుంది. రూథర్‌ఫోర్డ్ గుజరాత్ టైటాన్స్‌కు రూ.2.6 కోట్లకు అమ్ముడయ్యాడు. అదే ధరతో ముంబై ఇండియన్స్‌కు మారనున్నాడు. 2025 సీజన్‌లో గుజరాత్ టైటాన్స్ తరఫున 13 మ్యాచ్‌లలో 291 పరుగులు చేశాడు.

## హార్దిక్ ఈజ్ బ్యాక్.. భారత్‌కు గుడ్ న్యూస్



ఆసియా కప్ 2025 సమయంలో హార్దిక్ పాండ్యా క్వాడ్రిసెప్స్ కండరాల గాయంతో జట్టును వీడాడు. అప్పటి నుంచి పాకిస్తాన్‌తో జరిగిన కీలక ఫైనల్‌తో పాటు ఆస్ట్రేలియా పర్యటనకు దూరమయ్యాడు. అయితే, ఇప్పుడు టీ20 ప్రపంచ కప్‌కు చాలా ముందుగానే తిరిగి రావడానికి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. తొలిసారిగా సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో బరోడా తరఫున ఆడనున్నాడు. ఈ దేశీయ టీ20 టోర్నమెంట్‌లో హార్దిక్ పాండ్యా మొదటి రెండు మ్యాచ్‌లకు అందుబాటులో ఉంటాడు. ఆ తర్వాత రాబోయే దక్షిణాఫ్రికాతో వన్డే, టీ20 సిరీస్‌లలో టీమిండియాలోకి తిరిగి వస్తాడు. హార్దిక్ పాండ్యా ప్రస్తుతం బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ లో కోలుకుంటున్నాడు. నవంబర్ 26న బెంగాల్‌తో జరిగే సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ ప్రారంభ మ్యాచ్‌కు హార్దిక్ ఫిట్‌గా ఉంటాడని ఓ నివేదిక పేర్కొంది. ఒకవేళ ఏమైనా ఆలస్యమైతే, నవంబర్ 28న పుదుచ్చేరితో జరిగే టోర్నమెంట్ రెండో మ్యాచ్ నాటికి ఈ స్టార్ ఆల్‌రౌండర్ ఖచ్చితంగా యాక్షన్‌లోకి తిరిగి వస్తాడు. గాయం నుంచి కోలుకున్న తర్వాత హార్దిక్ పాండ్యాకు ఎటువంటి విశ్రాంతి ఉండదు. బరోడా తమ అన్ని మ్యాచ్‌లను ఆడనున్న హైదరాబాద్‌కు పాండ్యా నేరుగా చేరుకుంటాడు.

## కేకేఆర్ అసిస్టెంట్ కోచ్‌గా షేన్ వాట్సన్



ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్‌కు ముందు కోల్‌కతా నైట్ రైడర్స్ తమ కోచింగ్ బృందంలో ఓ కీలక మార్పు చేసింది. ఆస్ట్రేలియా మాజీ ఆల్‌రౌండర్ షేన్ వాట్సన్‌ను జట్టుకు అసిస్టెంట్ కోచ్‌గా నియమించినట్లు ప్రకటించింది. షేన్ వాట్సన్ ఇటీవల ప్రధాన కోచ్‌గా నియమితులైన భారత మాజీ అసిస్టెంట్ కోచ్ అభిషేక్ నాయర్‌తో కలిసి పని చేస్తాడు. షేన్ వాట్సన్ ఆస్ట్రేలియా తరఫున 59 టెస్టులు, 190 వన్డేలు, 58 టీ20 ఇంటర్నేషనల్ మ్యాచ్‌లలో ప్రాతినిధ్యం వహించాడు తన నియామకంపై షేన్ వాట్సన్ సంతోషం వ్యక్తం చేశాడు. 'కోల్‌కతాకు మరో టైటిల్ తీసుకురావడానికి కోచింగ్ బృందం, ఆటగాళ్లతో కలిసి పని చేయడానికి నేను ఆసక్తిగా ఉన్నాను' అని పేర్కొన్నారు. షేన్ వాట్సన్ గతంలో రాజస్థాన్, చెన్నై తరఫున ఆడాడు. 2008లో రాజస్థాన్ రాయల్స్ జట్టుకు తొలి ఐపీఎల్ టైటిల్‌ను అందించడంలో కీలక పాత్ర పోషించారు. ఆ సీజన్‌లో, అలాగే 2013లో కూడా మోస్ట్ వాల్యూవబల్ ప్లేయర్ అవార్డును గెలుచుకున్నారు.

## ప్రణయ్ ఓటమి.. | క్వార్టర్స్‌కు లక్ష్యసేన్



ఈ సీజన్‌లో చెలరేగిపోతున్న లక్ష్యసేన్.. జపాన్‌లో తనఫామ్ చూపిస్తున్నాడు. కుమమొటో మాస్టర్స్‌లో క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. గురువారం జరిగిన ప్రీ క్వార్టర్స్‌లో అతడు సింగపూర్ షట్లర్ జియా హెంగ్ జాసన్‌ను చిత్తు చేశాడు. మరో భారత ఆటగాడు హెచ్‌ఎస్ ప్రణయ్ కథ రెండో రౌండ్‌లోనే ముగిసింది. వరుస సెట్లలో విఫలమైన అతడు చేతిలో కంగుతిన్నాడు. క్వార్టర్స్‌లో అడుగుపెట్టడం ద్వారా పురుషుల సింగిల్స్‌లో భారత పతకం ఆశలను లక్ష్యసేన్ సజీవంగా ఉంచాడు. ఏడోసీడ్ అయిన లక్ష్యసేన్ కుమమొటో మాస్టర్స్‌లో తన తడాఖా చూపించాడు. తొలి రౌండ్ నుంచి దుమ్మురేపుతున్న భారత షట్లర్ ప్రీ క్వార్టర్స్‌లో జియా హెంగ్ జాసన్ (సింగపూర్)ను ఓడించాడు. 39 నిమిషాల పాటు సాగిన పోరులో ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. తొలి సెట్‌ను 21-13తో అలవోకగా గెలుచుకున్న అతడు.. రెండో సెట్‌ను సైతం 21-11తో సొంతం చేసుకున్నాడు. సెమీస్ బెర్తు కోసం 2021 వరల్డ్ ఛాంపియన్ లేహ్ కీన్ యెవ్‌తో లక్ష్యసేన్ తలపడనున్నాడు. మరోవైపు ప్రణయ్ తొలి రౌండ్‌లో ఫర్వాలేదనిపించినా.. డెన్మార్క్ షట్లర్ రాస్మస్ గెమ్కే ధాటికి చేతులెత్తేశాడు. రెండు సెట్లలో వెనకబడిన ప్రణయ్ చివరకు 18021, 15-21తో ఓటమి పాలయ్యాడు.

ఈవార్తలు
# ప్రజావాణి
సంపాదకీయం
నేటి ఈవార్తలు
శుక్రవారం 14-11-2025 | www.evarthalu.com






# అరచేతిలో బొమ్మ.. బాలలతో ఆటలు

వైకుంఠ పాళీ, గోటిబిళ్ళ, బిళ్ళంగోడు, గిల్లి దండా, ఛిల్లా కట్టే.. ఇలా ఎన్నో ఆటలు. ఇప్పుడు ఇవేం కనిపించడం లేదు శారీరక శ్రమ లేనేలేదు. కబడ్డీ, క్రికెట్, హాకీ, బ్యాడ్మింటన్ లాంటివి మాత్రమే కనిపిస్తున్నాయి. కోతి కొమ్మచ్చి, దొంగ పోలీస్, నేల-బండ, తొక్కుడు బిళ్ళ, బొమ్మల పెళ్ళి ఇలాంటివి కనుమరుగు అయిపోయాయి. సోషల్‌మీడియా, వీడియోలు, ఇంటర్నెట్ గేమ్స్‌లో తలమునకలు అవుతున్న యువత అనేక బాల్య స్మృతుల్ని కోల్పోతోంది. చిన్న వయసు పిల్లలు 3 గంటలకుపైగా స్మార్ట్‌ఫోన్‌లోనే గడుపుతున్నారంటే పరిస్థితి ఎలా తయారైందో అర్థం చేసుకోవచ్చు. ఆటలు, సరదాలు.. బాల్యం అదో అనుభూతి.. జీవితంలో వెనక్కి వెళ్ళి చూసుకుంటే ఎన్నో అనుభూతులు.. అవన్నీ ఒకప్పుడు.. ఇప్పుడు అవేం కనిపించడం లేదు.

ఆటలంటే స్మార్ట్ ఫోన్లలో గేమ్స్ మాత్రమే. ఒకప్పుడు ఒంటినిండా చెమట పట్టి, ఆరోగ్యం వచ్చేది. కానీ ఇప్పుడు ఏసీ రూముల్లో మంచాల మీద, కుర్చీల్లో, సోఫాల్లో కూర్చుని ఆడేసుకుంటున్నారు. శరీరక సౌష్టవం కోసం, మానసిక ఉల్లాసం కొరకు తర తరాలనుండి ఆటలు ఒక అద్భుతమైన సాధవముగా ఆటలు మనం పరిగణిస్తుంటాం. మన వాళ్ళు రక రకాల ఆటలు ఆడుతూ ఉండేవారు. సెలవులు వచ్చాయంటే అమ్మమ్మ ఇంటికో, మేనత్త ఇంటికో వెళ్లి హాయిగా ఆటలాడుకునేవాళ్ళం. కానీ ఇప్పుడు అవి కనిపించడం లేదు. మూడేళ్ల వయసు పిల్లలు స్మార్ట్ ఫోన్‌కి బానిసలుగా మారారు. చేతిలోంచి ఫోన్ లాక్కుంటే రెండేళ్ళ లోపు పిల్లలు ఏడుపు లంకించుకుంటారు. కోవిడ్ మహమ్మారి పిల్లల చదువులను దారుణంగా దెబ్బతీసింది. దీంతో వారంతా స్మార్ట్‌ఫోన్లకు బానిసలుగా మారిపోయారు. ఆన్‌లైన్ క్లాసుల కారణంగా తల్లిదండ్రులు పిల్లలకు అనివార్యంగా స్మార్ట్‌ఫోన్లు చేతికివ్వాల్సి వచ్చింది. 9-13 ఏండ్ల వయసు పిల్లలు 3 గంటలకుపైగా స్మార్ట్‌ఫోన్‌లోనే వుండిపోతున్నారు. వారి కళ్ళు స్మార్ట్ ఫోన్ల పైనే ఉండిపోతున్నాయి. 13-17 ఏండ్ల వయసు పిల్లలు స్మార్ట్‌ఫోన్లకు బానిసలైపోతున్నారు. సోషల్‌మీడియా, వీడియోలు, ఇంటర్నెట్ గేమ్స్‌ల్లో పిల్లలు మునిగిపోతున్నారు. ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్, ఫేస్‌బుక్, టెలిగ్రాం.. వంటివి ఖాతాలు సృష్టించుకోవడానికి అనుమతులివ్వగా.. పదేండ్లలోపు పిల్లలు కూడా తప్పుడు వయసుతో ఖాతాలు తెరుస్తున్నారు. వీటిపై ఆయా సంస్థలు నివారణ చర్యలు చేపట్టడంలేదు. దీంతో ఫోన్‌కు బానిసై మానసిక అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. తల్లిదండ్రులు ఉద్యోగస్తులు, వ్యాపారులు కావడం వల్ల వారిపై అజమాయిషీ ఉండటం లేదు. మార్కెట్లోకి వచ్చే కొత్త ఫోన్లకు పిల్లలు త్వరగా అట్రాక్ట్ అవుతున్నారు. తల్లిదండ్రుల మీద ఒత్తిడి తెచ్చి మరీ కొత్త గాడ్జెట్స్ కొనేస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే అరచేతిలో బొమ్మ.. బాల్యాన్ని ఆడిస్తుంది.. ఆడిస్తోంది కూడా. నేడు బాలల దినోత్సవం సందర్భంగా.. తల్లిదండ్రులకు, పిల్లలకు చెప్పేదొక్కటే. కంటికి శ్రమ తగ్గించి, శారీరక శ్రమపై దృష్టి పెడితే ఆరోగ్యానికి ఆరోగ్యం. ఉల్లాసానికి ఉల్లాసం దొరుకుతుంది.



# 10 కోట్ల మంది మధుమేహులు

## (నేడు ప్రపంచ మధుమేహ దినోత్సవం)

మధుమేహం మహమ్మారిలా విస్తరిస్తోంది. ఎంతలా అంటే.. దేశంలో మధుమేహ బాధితుల సంఖ్య 10.1 కోట్లకు చేరింది. భారతదేశంలోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలలోనూ మధుమేహం క్రమంగా వేగాన్ని పుంజుకుంటోందని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది.మధుమేహం నియంత్రణ, నిరోధం పట్ల ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రతి ఏటా నవంబర్ 14వ తేదీని 'ప్రపంచ మధుమేహ నిరోధక దినం'గా జరుపుకుంటున్నారు. ఇన్సులిన్‌ను కనుగొన్న సర్ ఫ్రెడరిక్ బ్యాంటింగ్ పుట్టినరోజు సందర్భంగా ఈ తేదీని నిర్ణయించారు. నేటి మనిషి జీవన విధానం, ఆహారంలో వచ్చిన విప్లవాత్మక మార్పులే మధుమేహం వంటి దీర్ఘకాలిక వ్యాధులకు ప్రధానంగా ఆజ్యం పోస్తున్నాయి. శారీరక శ్రమ లేకపోవడం, ఆహారంలో చోటు చేసుకున్న మార్పులు, కల్తీలు, రసాయనిక ఎరువులు/క్రిమిసంహారక మందుల వాడకం, విచ్చలవిడి ప్లాస్టిక్ వినియోగం, పర్యావరణ మార్పులు, కొత్త వైరల్ వ్యాధులు, వృత్తిపరమైన, మానసిక ఒత్తిడి, జన్యువులలో వచ్చే మార్పులు.. ఈ కారణాలన్నీ రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించే ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేసే క్లోమ గ్రంథిని అసాధారణ రీతిలో ప్రభావితం చేస్తున్నాయి. శరీర అవసరాలకు సరిపడా ఇన్సులిన్ ఉత్పత్తి కాకపోవడం, ఇన్సులిన్ పనితీరులో లోపాలు (ఇన్సులిన్ రెసిస్టెన్స్), శరీర కణాలు ఇన్సులిన్‌ను వినియోగించుకోలేకపోవడం వంటి సమస్యల వల్ల రక్తంలో చక్కెర శాతం అసాధారణ స్థాయిలో పెరుగుతోంది. నిత్య జీవితంలో మనం వాడే ప్లాస్టిక్ అవశేషాల ప్రభావం ప్యాంక్రియాస్‌పై పడి, ఇన్సులిన్ ఉత్పత్తిని తగ్గించేస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇన్సులిన్ ఉత్పత్తి అయినా, శరీర కణజాలాలలో నిరోధకత వల్ల అది సరిగ్గా ఉపయోగపడక రక్తంలో చక్కెర స్థాయి పెరిగిపోతోంది. దీన్నుంచి బయటపడేందుకు జీవనశైలిని మార్చుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ప్రజలు గ్రహించాలి. - డాక్టర్ సంకీర్తి, డయాబెటాలజిస్ట్



# 'చాచా'కు చిచ్చర పిడుగులంటే ప్రాణం

భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ 1889 నవంబర్ 14న జన్మించారు. ఆయన గులాబీలను చాలా ఇష్టపడేవాడు, పిల్లలను చాలా ప్రేమించేవారు. వారే ఈ దేశ భవిష్యత్తు అని నెహ్రూ నమ్మారు. పిల్లలు బాగా చదువుకుంటే అద్భుతాలు సృష్టించగలరు. పిల్లలను మనం పెంచే విధానం దేశ భవిష్యత్తును నిర్ణయిస్తుందని చెప్పేవారు. 1964లో జవహర్‌లాల్ నెహ్రూ మరణానంతరం ఆయనను గౌరవించాలని పార్లమెంటులో తీర్మానం చేశారు. ఆయన పుట్టినరోజును బాలల దినోత్సవం అధికారిక తేదీగా పార్లమెంటులో ప్రకటించారు. ఇంతకు ముందు భారతదేశం నవంబర్ 20న బాలల దినోత్సవాన్ని జరుపుకునేది. ఐక్యరాజ్యసమితి ఈ రోజును 1954లో సార్వత్రిక బాలల దినోత్సవంగా ప్రకటించింది. దీని తర్వాత భారతదేశంలో నెహ్రూ జన్మదినాన్ని పురస్కరించుకుని బాలల దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం.




నెహ్రూను పిల్లలంతా ముద్దుగా 'చాచా నెహ్రూ' అని పిలిచేవారు. ఆయన కూడా ఎప్పుడూ వారి మధ్య ఉండేందుకు ఇష్టపడేవారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత నెహ్రూ బాలలు, యువత కోసం గొప్ప పనులు చేశారు. ఆయన ప్రధాని అయ్యాక పిల్లల చదువులకే మొదటి ప్రాధాన్యత ఇచ్చారు. యువత అభివృద్ధి మరియు ఉపాధిని ప్రోత్సహించడానికి, అతను భారతదేశంలో ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ మరియు ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ వంటి వివిధ విద్యా సంస్థలను స్థాపించారు. దేశాన్ని ఆధునీకరించడంలో ముఖ్యమైన పాత్ర పోషించారు. పంచవర్ష ప్రణాళికలను ప్రారంభించడం ద్వారా భారతదేశంలో పరిశ్రమలో కొత్త శకాన్ని ప్రారంభించారు. ఇది మాత్రమే కాదు, భారతదేశంలో పోషకాహార లోపం నుండి పిల్లలను రక్షించడానికి ఉచిత ప్రాథమిక విద్య, పాలతో సహా ఉచిత ఆహారం కూడా పాఠశాలల్లో చేర్చారు. పిల్లలే దేశానికి ఉజ్వల భవిష్యత్తు అని నెహ్రూ చెప్పేవారు. అందుకే ఈ రోజు భారతదేశ మొదటి ప్రధానమంత్రి జయంతిని గుర్తుచేసుకునే చిరస్మరణీయమైన రోజు.

- సత్యనారాయణ రెడ్డి, టీచర్

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.